తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి

బుధవారం
14 అక్టోబర్ 2026

పేజీలు : 8

Follow :




# హుజూర్ నగర్‌లో రోడ్ల పై జన జాతర

○పాత బస్టాండ్ వద్ద వాహనాల పార్కింగ్ ఇష్టారాజ్యం ○ట్రాఫిక్ కానిస్టేబుల్ లసంఖ్యను పెంచాలి ○ఇందిరాచౌక్ లో ట్రాఫిక్ పోలీసుని పర్మినెంట్ చేయాలి ○పట్టించుకోని అధికారులు.. ○గాలికొదిలేసిన ట్రాఫిక్ నియంత్రణ జాతరను తలపిస్తున్న రహదారులు ○రహదారుల ఆక్రమణలపై ప్రత్యేక నిఘా పెట్టాలి ○ ర్యాష్ డ్రైవింగ్ తో ప్రజలకు తప్పని తిప్పలు

**హుజూర్‌నగర్ అక్టోబర్ 13 (జనంసాక్షి):** పట్టణంలో పాత బస్టాండ్, శాంతి స్తూపం, ఇందిరా చౌక్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య పూర్తిగా అస్తవ్యస్తంగా మారుతోందని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్సులు ఆటోలు ఇతర వాహనాలు ఇష్టానుసారంగా నిలిపివేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో వాహనాల రాకపోకలు సజావుగా సాగక గందరగోళం నెలకొంది. పాదచారులు రోడ్డు దాటేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టకపోవడం, దానికి తోడు కరువు సమస్య తో రోజురోజుకి కూలీల తాకిడి పెరుగుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రద్దీ ప్రాంతంలో వాహనాల ఇష్టారాజ్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ సరైన చర్యలు చేపట్టటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలని, పాత బస్టాండ్, ఇందిరా సెంటర్, శాంతి స్థూపం వద్ద ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని, అక్రమ పార్కింగ్‌ను నియంత్రించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# గోదావరి పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

○ ఐటీసీ నుంచి భద్రాచలం వంతెన వరకు రహదారి సుందరీకరణకు వారం రోజుల్లో ప్రణాళిక

○ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్..

**భద్రాచలం అక్టోబర్ 13 (జనంసాక్షి)**
గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ అభివృద్ధి, పుష్కర ఘాట్ల నిర్మాణం, భక్తులకు అవసర మైన మౌలిక సదుపాయాల కల్పన పనులను

వార్తా లోపలి పేజీలో

## నేరాల ఛేదనలో వలిగొండ పోలీసుల ప్రతిభ.. ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసలు



వార్తా లోపలి పేజీలో

# పాల్వంచలో 'స్పైసీ' రగడ.. రాజకీయ సెగ!

○ గాంధీ జయంతి నాటి మాంసం విక్రయాల నుంచి మొదలైన వివాదం

○ హోటళ్ల బంద్‌తో చిన్న వ్యాపారులకు తప్పని ఇబ్బందులు

○ వివిధ శాఖలకు బీఆర్ఎస్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ నేతల ఫిర్యాదులు..



**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** పాల్వంచ పట్టణంలో 'స్పైసీ రెస్టారెంట్' కేంద్రంగా చెలరేగిన వివాదం రోజుకో మలుపు తిరుగుతూ ప్రస్తుతం తీవ్ర రాజకీయ రంగు పులుముకుంది. వ్యక్తిగత తగాదాలతో ప్రారంభమైన ఈ వ్యవహారం.. ఇప్పుడు వ్యాపార నిబంధనలు, అధికారిక అనుమతులు, ప్రభుత్వ శాఖల పర్యవేక్షణ వరకు చేరి పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది.

**కార్మికుడి ఫిర్యాదుతో మొదలు...**
అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మాంసం విక్రయాలు జరపకూడదనే నిబంధన ఉన్నప్పటికీ.. ఆ రోజు విక్రయాలు జరిపారన్న అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అదే రోజు అర్ధరాత్రి వ్యాపారం ముగిసిన తర్వాత, రెస్టారెంట్‌లో పనిచేస్తున్న ఒక కార్మికుడు భోజనం చేస్తుండగా యజమాని ఆగ్రహం వ్యక్తం చేసి తనపై దాడి చేశాడని ఆరోపిస్తూ బాధితుడు పాల్వంచ పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. కష్టమర్లు వస్తున్న సమయంలో

మిగతా 2లో

# కాంగ్రెస్ పాలనతో రైతులకు తీవ్ర నష్టం

## మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 13 (జనంసాక్షి)**
ప్రభుత్వ వైఫల్యంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరం గా మారిందని, కరువు పరిస్థితులపై ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకోవాలని పువ్వాడ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనతో రాష్ట్రంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారి పరిస్థితి ఆందోళనకరంగా మారిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో నెలకొంటున్న కరువు పరిస్థితులు, సాగునీరు, విద్యుత్ కొరతతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంపై గత తొమ్మిది నెలలుగా ప్రపంచ వాతావరణ నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు, విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని రైతులకు అవసరమైన నీరు, విద్యుత్ అందించలేని పరిస్థితి నెలకొనడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలపై తక్షణమే స్పందించి, సాగునీరు, విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ ఇదే వైఖరిని కొనసాగిస్తే ప్రజాగ్రహాన్ని ఎదుర్కోక తప్పదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

# పాల్వంచలో 'స్పైసీ' రగడ.. రాజకీయ సెగ!

భోజనం చేయడంపైనే ఈ వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు యజమానిపై కేసు నమోదు చేశారు. అయితే, ఈ ఘటనపై రెస్టారెంట్ యాజమాన్యం నుంచి అధికారిక వివరణ రావాల్సి ఉంది.

**హోటళ్ల బంద్‌తో చిరు వ్యాపారుల అష్టకష్టాలు**

పోలీసులు కేసు నమోదు చేసిన తర్వాత ఈ వివాదం మరింత ముదిరింది. చట్టపరంగా సమస్యను పరిష్కరించుకోవాల్సింది పోయి, తనకు మద్దతుగా కొందరు రాజకీయ అనుచరులను కూడగట్టి పట్టణంలోని హోటళ్లను మూసివేయాలంటూ పిలుపునిచ్చారన్న ఆరోపణలు వినిపించాయి. ఈ నేపథ్యంలో సోమవారం పాల్వంచలో పలు హోటళ్లు మూతపడ్డాయి.ఈ బంద్ ప్రభావం కేవలం పెద్ద హోటళ్లకే పరిమితం కాకుండా.. చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్డు పక్కన బండ్లపై చిరు వ్యాపారాలు చేసుకునే పేదల జీవనోపాధిపై పడింది. ఒక హోటల్ వివాదం కారణంగా తమకు ఉపాధి లేకుండా పోయిందని చిన్న వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఈ బంద్‌కు ఎవరు పిలుపునిచ్చారు, ఎంతవరకు అమలు జరిగిందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

**వివిధ శాఖలకు రాజకీయ పార్టీల ఫిర్యాదులు**

ఈ పరిణామాల నేపథ్యంలో మంగళవారం బీఆర్ఎస్ మరియు తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు రంగంలోకి దిగారు. స్పైసీ రెస్టారెంట్ నిర్వహణలో భారీగా నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయంటూ వివిధ శాఖల అధికారులకు వారు (వేర్వేరుగా) వినతిపత్రాలు మంగళవారం అందజేశారు.

విద్యుత్ శాఖకు: రెస్టారెంట్ ముందు అక్రమంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని, దీనిపై విచారణ జరిపి అనుమతులు లేకపోతే తొలగించాలని కోరారు.

**మున్సిపల్ అధికారులకు:**

ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ అక్టోబర్ 2న మాంసం విక్రయాలు జరిపారని, డ్రైనేజీని ఆక్రమించారని, ఉద్యోగులకు పీఎఫ్ (ఖఈ) చెల్లించడం లేదని, అగ్నిమాపక శాఖ అనుమతులు కూడా లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు.పోలీసులకు: నిబంధనలను ఉల్లంఘించి ఉద్దేశపూర్వకంగా గాంధీ జయంతి రోజు మాంసం విక్రయాలు జరిపి జాతిపిత మహాత్మా గాంధీని అవమానించారంటూ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ వినతిపత్రాలు సమర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కిలారు నాగేశ్వరరావు, కనకాల బాలకృష్ణ, ముత్యాల ప్రవీణ్, దాసరి నాగేశ్వరరావు, అలివేలు, చింతలచెరువు దుర్గ, కుంపటి శివ, తదితరులు అలాగే తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు మల్లెల వీరనారాయణ, అటికెటి శంకర్ తదితరులు ఉన్నారు.

**అధికారుల స్పందనపై సర్వత్రా ఆసక్తి**

ఒకవైపు కార్మికుడిపై దాడి కేసు, మరోవైపు రెస్టారెంట్‌పై వస్తున్న వరుస ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కేవలం వినతిపత్రాలు స్వీకరించడంతో సరిపెట్టకుండా, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని ప్రజలు కోరుతున్నారు. వ్యక్తిగత వివాదాలు రాజకీయ రంగు పులుముకుని చిన్న వ్యాపారుల పొట్టకొట్టకుండా, చట్టం తన పని తాను చేసుకుపోయేలా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు.



## అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

**మధిర, అక్టోబర్ 13 (జనంసాక్షి):**
మధిర పట్టణంలోని లడక్ బజార్ నందు శ్రీ దేవి శరన్నవరాత్రులు లో భాగంగా శ్రీదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి మండపం వద్ద మూడవ రోజు మంగళవారం శ్రీ అన్నపూర్ణాదేవి అవతారం లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అన్నం అంటే ఆహారం పూర్ణ అంటే సంపూర్ణత అంటే ఆకలితో ఉన్నవారికి లోటు లేకుండా ఆహారాన్ని ప్రసాదించి తల్లి అన్నపూర్ణాదేవి, ఒకసారి లోకంలో అన్నం మాయ మాత్రమే, శాశ్వతం కాదని పార్వతి దేవి అన్నపూర్ణ రూపం లో వచ్చి శివుడికి భిక్ష (అన్నం) పెట్టి ఆహార ప్రాముఖ్యతను లోకానికి చాటి చెప్పింది అని పూజారి అనంత శ్రీనివాసచార్యులు తెలిపారు. దసరా నవరాత్రులు పూజల్లో భాగంగా మూడో రోజైన అమ్మవారిని అన్నపూర్ణ దేవి అలంకారంలో భక్తుల విశేషంగా పూజిస్తారు. ఈ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సాయంత్రం 7 గంటల నుండి సాంప్రదాయ బద్ధంగా పెద్ద సంఖ్యల మహిళలు బతుకమ్మ ఆటలాడి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళా భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీ ద్రా ద్వారా చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పిండి నాగరాజు, రామారావు, కిరణ్, కృష్ణయ్య, అంకిరాజు, పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి పూజలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దయానంద్



**పెనుబల్లి, అక్టోబర్ 13 (జనంసాక్షి)**
రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్ట దయానంద్ మంగళవారం పెనుబల్లి కుబేర ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో దేవి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించినారు, ఈ సందర్భంగా భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఆలయ వ్యవస్థాపకు లు బొర్రా కోటేశ్వరరావు, కమిటీ చైర్మన్ ఆ చంటి శ్రీనివాసరావు, జిల్లెల్ల వెంకట రామకృష్ణ,వంగా సత్యనారాయణ, గోదా శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లలో అంతా గందరగోళమేనా?

❍లబ్ధిదారుల జాబితాపై ఏదీ స్పష్టత లేదు.. ❍సర్పంచులకు సమాచారం లేదు! ❍రెండో జాబితాపై ప్రచారం.. సమాధానం చెప్పేది ఎవరు? ❍ఐదు గ్రామాల సర్పంచులు ప్రజావాణి బాట.. హౌసింగ్ శాఖ తీరుపై ప్రశ్నలు! ❍జనంసాక్షి ప్రత్యేక కథనం

**మర్రిగూడ, అక్టోబర్ 13 (జనంసాక్షి)**
పేదలకు సొంతింటి కల సాకారం చేయాల్సిన ఇందిరమ్మ ఇళ్ల పథకం మర్రిగూడ మండలంలో అనేక ప్రశ్నలకు కేంద్రంగా మారింది. లబ్ధిదారుల ఎంపిక జాబితాల తయారీపై స్పష్టత లేదు.. రెండో జాబితా పేరుతో ప్రచారం జరుగుతున్నా అధికారిక సమాచారం లేదు.. హౌసింగ్ శాఖ అధికారుల నుంచి సమాధానాలు లేవు.. ఇందిరమ్మ కమిటీల్లో సర్పంచుల పాత్ర ఏమిటో తెలియదు! ఇన్ని సందేహాల మధ్య పేదలకు ఇళ్ల కేటాయింపు ప్రక్రియ ఎలా సాగుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చివరకు తమ గ్రామాల్లో ప్రజలకు సమాధానం చెప్పలేక ఐదు గ్రామాల సర్పంచులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిని ఆశ్రయించాల్సి వచ్చింది.

సర్పంచులకే తెలియకపోతే.. ప్రజలకు చెప్పేదెవరు

గ్రామంలో ఏ కుటుంబానికి ఇల్లు అవసరం ఎవరు అర్హులు లబ్ధిదారుల జాబితా ఏ దశలో ఉంది? రెండో జాబితాపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవం ఎంత? ఇలాంటి ప్రశ్నలకు గ్రామస్థాయిలో సమాధానాలు దొరకాల్సి ఉండగా, ప్రజలు ఎన్నుకున్న సర్పంచులే అధికారిక సమాచారం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఫిర్యాదు ద్వారా వెల్లడవుతోంది.

గ్రామాల్లో ప్రజలు తమ సమస్యలను సర్పంచుల దృష్టికి తీసుకెళ్తారు. కానీ పథకానికి సంబంధించిన కీలక సమాచారం అధికారుల వద్దే ఉండి, ప్రజాప్రతినిధులకు అందకపోతే బాధ్యత ఎవరిది? ప్రజలకు సమాధానం చెప్పాల్సిన సర్పంచులకు సమాచారం ఇవ్వని అధికారుల తీరుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**రెండో జాబితాపై ప్రచారమే.. అధికారిక స్పష్టత ఏది**

ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితాపై గ్రామాల్లో ప్రచారం జరుగుతున్నప్పటికీ, దానికి సంబంధించిన అధికారిక



వివరాలపై స్పష్టత కోరుతూ సర్పంచులు ఫిర్యాదు చేశారు. జాబితా తయారీకి అనుసరిస్తున్న ప్రాతిపదిక ఏమిటి? అర్హుల ఎంపిక ఎలా జరుగుతోంది? అభ్యంతరాలు తెలిపేందుకు అవకాశం ఉందా? తుది జాబితాను ఎప్పుడు, ఏ విధంగా ప్రకటిస్తారు? అనే ప్రశ్నలకు సమాధానాలు అవసరమవుతున్నాయి.

ప్రభుత్వ సంక్షేమ పథకానికి సంబంధించి అధికారిక సమాచారం అందుబాటులో లేకపోతే అనధికార ప్రచారానికి, అపోహలకు అవకాశం ఏర్పడుతుంది. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకతపై సందేహాలు రాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. జాబితాపై ప్రచారం జరుగుతున్నప్పుడు వాస్తవాలను వెల్లడించాల్సిన యంత్రాంగం మౌనం వహిస్తోందన్న భావన ప్రజల్లో నెలకొంటే అది పథకం అమలుపై నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది.

ఇందిరమ్మ కమిటీల్లో సర్పంచుల పాత్ర ఏమిటి?

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో గ్రామస్థాయి కమిటీల పాత్ర, సర్పంచుల బాధ్యతలు, అధికార పరిధిపై స్పష్టత ఇవ్వాలని ఐదు గ్రామాల సర్పంచులు కోరడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఎన్నికైన గ్రామ ప్రథమ పౌరుడికి ఏ బాధ్యతలు అప్పగించారు? లబ్ధిదారుల ఎంపికలో సర్పంచుల పాత్ర ఉందా? ఉంటే దాని పరిధి ఎంత? లేకపోతే గ్రామస్థాయిలో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిపై ఉంటుంది?

ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేకపోవడం పాలనలో సమన్వయంపై సందేహాలు రేకెత్తిస్తోంది. గ్రామపంచాయతీకి ఒక బాధ్యత, హౌసింగ్ శాఖకు మరో బాధ్యత, ఇందిరమ్మ కమిటీలకు ఇంకో బాధ్యత ఉన్నప్పుడు వాటి మధ్య సమన్వయం ఎలా సాగుతోంది? అధికారిక మార్గదర్శకాలను ప్రజాప్రతినిధులకు తెలియజేయాల్సిన అవసరం లేదా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**ఐదు గ్రామాల సర్పంచులు ప్రజావాణికి ఎందుకు వెళ్లాల్సి వచ్చింది?**

మర్రిగూడ మండలంలోని ఎర్రగండ్లపల్లి, కొందూరు, తమ్మడపల్లి, అజిలాపురం, కేబిపల్లి గ్రామాల సర్పంచులు సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. లబ్ధిదారుల ఎంపిక జాబితాల తయారీ, రెండో జాబితాపై ప్రచారం, హౌసింగ్ శాఖ నుంచి సమాచారం అందకపోవడం, ఇందిరమ్మ కమిటీల్లో సర్పంచుల బాధ్యతలపై స్పష్టత లేకపోవడం వంటి అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

గ్రామస్థాయిలోనే పరిష్కారం కావాల్సిన సందేహాలపై జిల్లా స్థాయి అధికారులను ఆశ్రయించాల్సి రావడం సంబంధిత శాఖ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అయితే, సర్పంచులు చేసిన ఫిర్యాదుపై హౌసింగ్ శాఖ అధికారులు వివరణ అందాల్సి ఉంది.

కలెక్టర్ జోక్యం చేసుకుంటారా?

ఐదు గ్రామాల సర్పంచులు లేవనెత్తిన ప్రశ్నలకు జిల్లా యంత్రాంగం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. రెండో జాబితాపై ప్రచారంలో ఉన్న వాస్తవాలను వెల్లడించాలి. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన మార్గదర్శకాలు, జాబితాల స్థితి, అభ్యంతరాల పరిష్కార విధానాన్ని స్పష్టం చేయాలి. ఇందిరమ్మ కమిటీల్లో సర్పంచుల పాత్ర, బాధ్యతలపై అధికారిక వివరణ ఇవ్వాలి.

పేదలకు ఇళ్లు మంజూరు చేయడమే కాకుండా, అర్హుల ఎంపిక నుంచి జాబితాల ప్రకటన వరకు ప్రతి దశలో పారదర్శకత పాటించడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత. సమాచారం కోసం సర్పంచులే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నకు సమాధానం రావాల్సి ఉంది.

ఇప్పటికైనా అధికారుల స్పందన ఏది?

ఇందిరమ్మ ఇళ్ల పథకంపై గ్రామాల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయడం, అధికారిక సమాచారాన్ని అందుబాటులో ఉంచడం, ప్రజాప్రతినిధుల బాధ్యతలపై స్పష్టత ఇవ్వడం అత్యవసరం. ఐదు గ్రామాల సర్పంచులు ప్రజావాణిలో చేసిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్, హౌసింగ్ శాఖ అధికారులు ఏ చర్యలు తీసుకుంటారు? లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై స్పష్టత ఎప్పుడు ఇస్తారు? అన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

ప్రజల ప్రశ్న ఒక్కటే: పేదలకు ఇళ్లు అందించాల్సిన పథకంలో సందేహాలెందుకు? సర్పంచులకు సమాచారం అందించలేని పరిస్థితి?

# సీతారామ ప్రధాన కాలువ నిర్మాణంలో నాణ్యతా లోపాలు!

○సీసీ కాంక్రీట్ ధ్వంసం.. కాలువలో గండ్లు, మట్టి పూడికలు

○బాధ్యులైన కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలి

○నిర్మాణ లోపాలపై విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలి: తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ

**అన్నపురెడ్డిపల్లి అక్టోబర్ 13 (జనం సాక్షి)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ నిర్మాణంలో నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ఆరోపించారు. ప్రాజెక్టు పూర్తికాకముందే సీసీ కాంక్రీట్ దెబ్బతినడం, కాలువలో గండ్లు పడటం, వర్షాలకు మట్టి పేరుకుపోయి పూడిక ఏర్పడటం నిర్మాణ పనుల నాణ్యతపై అనుమానాలు కలిగిస్తున్నాయని విమర్శించారు. నాణ్యతా లోపాలకు బాధ్యులైన కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కట్టుగూడెం వద్ద సీతారామ ప్రధాన కాలువను రైతు సంఘం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రజాధనంతో నిర్మిస్తున్న కీలకమైన సాగునీటి ప్రాజెక్టు పనుల్లో ఇలాంటి లోపాలు చోటుచేసుకోవడం ఆందోళనకరమన్నారు. కాలువ నిర్మాణంలో జరిగిన నాణ్యతా లోపాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను గుర్తించాలని కోరారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాలువల పరిశీలన పేరుతో పర్యటనలు చేస్తున్నప్పటికీ, నిర్మాణ పనుల నాణ్యతపై తగిన శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు.



**జిల్లా రైతులకు సాగునీరు ఏది?**

సీతారామ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు తరలిపోతున్నప్పటికీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రైతులకు ఆశించిన స్థాయిలో సాగునీరు అందకపోవడం విచారకరమని సత్యనారాయణ అన్నారు. గోదావరి జలాలను వైరా రిజర్వాయర్, నాగార్జునసాగర్ ఆయకట్టుకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నా, జిల్లాలోని డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆరోపించారు. ప్రధాన కాలువ నిర్మాణంతో పాటు పంపిణీ కాలువలను కూడా పూర్తి చేసి స్థానిక రైతులకు సాగునీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**రెండో పంట వద్దనడం సమంజసమా?**

వచ్చే రబీ సీజన్‌లో రెండో పంట సాగు చేయవద్దని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవైపు సాగర్ ఆయకట్టుకు నీటిని తరలించేందుకు జూలూరుపాడు వద్ద సుమారు రూ.100 కోట్లతో కాలువ నిర్మించి అనుసంధానం చేయగా, మరోవైపు రైతులను రెండో పంట సాగు చేయవద్దని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. యాతాలకుంట నుంచి సత్తుపల్లి మండలానికి నీటిని తరలించేందుకు కాలువలు నిర్మిస్తున్నారని పేర్కొంటూ, స్థానిక రైతుల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం సమానంగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

**డిస్ట్రిబ్యూటరీ కాలువలు తక్షణమే పూర్తి చేయాలి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రాజెక్టులను సీతారామ ప్రాజెక్టుతో అనుసంధానం చేసి, స్థానిక రైతులకు సాగునీరు అందించాలని సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రధాన కాలువలో సీసీ కాంక్రీట్ దెబ్బతినడానికి గల కారణాలను నిపుణులతో పరిశీలింపజేసి, సమగ్ర విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. నాణ్యతా లోపాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణాన్ని వేగవంతం చేసి రైతులకు సాగునీటి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వాంకుడోత్ కోబల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జంగిలి వెంకటరత్నం, రైతు సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లింగనబోయిన వెంకటేశ్వర్లు, శ్రీను, వెంకన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలి

**ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి**

**అబ్బుగూడెంలో కొవ్వొత్తుల ర్యాలీ.. వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నాయకుల డిమాండ్**

**అన్నపురెడ్డిపల్లి అక్టోబర్ 13 (జనం సాక్షి)**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని, ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అబ్బుగూడెం గ్రామంలో వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు జంగిలి వెంకటరత్నం, రైతు సంఘం నాయకుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఐఆర్ ప్రక్రియపై తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆ హక్కు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రజా స్వామ్య హక్కులను, ఓటు హక్కును పరిరక్షించాలని కోరారు. రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా కాకుండా ప్రజల పక్షాన నిలబడి పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకొని, ఈ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గుర్రంపోడు హోరెత్తింది

**కరెంట్ కోతలపై బీఆర్ఎస్ నిప్పులు.. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిజిఆర్ ఆధ్వర్యంలో విద్యుత్ కేంద్రం ముట్టడి!**

**గుర్రంపోడు, అక్టోబర్ 13, (జనంసాక్షి)**

గుర్రంపోడు మండల కేంద్రంలో పెరుగుతున్న విద్యుత్ కోతలను నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పి.జి.ఆర్ నేతృత్వంలో నిరసన, రాస్తారోకో నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పిలుపుమేరకు తరలివచ్చిన పార్టీ శ్రేణులు, రైతులు కలిసి విద్యుత్ కేంద్రాన్ని ముట్టడించారు. అనంతరం నల్లగొండ?దేవరకొండ ప్రధాన రహదారిపై బైఠాయించడంతో కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి.ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు, వ్యవసాయ రంగానికి కరెంట్ ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. తక్షణమే 24 గంటల ఉచిత విద్యుత్‌ను పునరుద్ధరిం చాలని డిమాండ్ చేశారు.అనంతరం రాష్ట్ర నాయకులు పి.జి.ఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే కరెంట్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయని, గత బీఆర్ఎస్ హయాంలో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని గుర్తుచేశారు. అనంతరం రాష్ట్ర నాయకులు కదారి అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, విద్యుత్ కోతల వల్ల పొలాలకు నీరందక పంటలు ఎండిపోయే దుస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగం పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం తక్షణమే పట్టించుకోకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తేనపల్లి సర్పంచ్ కొ్ట్ర రామాంజనేయులు, లక్ష్మీదేవి గూడెం సర్పంచ్ నరేష్, మునుకుంట్ల రాజేష్ రెడ్డి, జాల మల్లేష్, వడిత్య నాగరాజు, వేముల యాదయ్య, రఘుపతి రెడ్డి, రామచంద్రం, ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎంపిటిసి శ్రీరాములు, ఎలన్ రెడ్డి, కుంటి గొర్ల లింగయ్య, కుర్మాల్ రెడ్డి, శంకర్, కట్ట హరీష్, పవన్, వినయ్, రైతులు నియోజకవర్గ, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కార్మికులకు దసరా వస్త్ర కానుకలు

**ఉపసర్పంచ్ చిలుకల సంతోష్ యాదవ్ సేవాభావం అభినందనీయం**



**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 13 (జనంసాక్షి):**

దసరా పండుగను పురస్కరించుకొని శివారెడ్డి గూడెం గ్రామ ఉపసర్పంచ్ చిలుకల సంతోష్ యాదవ్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామపంచాయతీ కార్మికులకు వస్త్ర కానుకలు పంపిణీ చేశారు. గ్రామ పారిశుధ్య నిర్వహణలో నిరంతరం సేవలందిస్తున్న కార్మికులను గౌరవిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొక్కు మల్లారెడ్డి,కార్యదర్శి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల ఛేదనలో వలిగొండ పోలీసుల ప్రతిభ.. ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసలు




**వలిగొండ, అక్టోబర్ 13(జనంసాక్షి):**

డీజిల్ దొంగతనం కేసులో నిందితుడిని గుర్తించి కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన వలిగొండ ఎస్సై, పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ అక్షయ్ యాదవ్ ప్రశంస పత్రం అందజేశారు. విధి నిర్వహణలో అప్రమత్తత, దర్యాప్తులో వేగం, నేరస్తులను పట్టుకోవడంలో చూపిన నైపుణ్యాన్ని ఎస్పీ ప్రత్యేకంగాఅభినందించారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించే దొంగతనాలు, ఇతర నేరాల నియంత్రణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాలకు పాల్పడే వారిని గుర్తించి చట్టం ముందు నిలబెట్టేందుకు సమర్థవంతంగా పనిచేయాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకొచ్చేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించిన వలిగొండ పోలీస్ బృందాన్ని ఎస్పీ అభినందించడం సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపింది.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**హుజూర్ నగర్ అక్టోబర్ 13 (జనంసాక్షి):**



పట్టణంలో మంగళవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం నాగార్జున సిమెంట్ ఫ్యాక్టరీ కి చెందిన బస్సు హుజూర్‌నగర్ నుండి మఠంపల్లి వెళ్లుతున్న క్రమంలో వ్యాపారస్తులకు ఉల్లిగడ్డలను సరఫరా చేస్తున్న రిక్షాను వెనుక నుండి బస్సు బలంగా ఢీ కొట్టడంతో రిక్షా నడుపుతున్న పిట్టల రమణయ్య రోడ్డు మీద పడిపోగా బస్సు అతని తలపై నుండి వెళ్లి బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మఠంపల్లి మండలం పెదవీడు గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ షేక్ బడే సాహెబ్ నిర్లక్ష్యం వలన ప్రమాదం జరిగి రమణయ్య మృతిచెందినట్లు తెలిపారు. మృతుని కుమారులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పట్టణ ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపారు.

## బహిరంగ వేలం

**మేళ్లచెరువు జనంసాక్షి**

మేళ్లచెరువు శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవస్థానంలో బహిరంగ వేలం 17-10-2026 శనివారం మధ్యాహ్నం 12 గంటలకు దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తామని ఈవో నాగెల్ల శంభిరెడ్డి తెలిపారు. కొబ్బరికాయలు పూజా సామాగ్రి హక్కు 50 వేలు, లడ్డూ పులిహోర ప్రసాదం హక్కు 30 వేలు, పూలు హక్కు 20 వేలు, కొబ్బరి చిప్పల హక్కు 20 వేలు డిపాజిట్ తో 01-11-2026 నుండి 31-10-2027 వరకు కేటాయిస్తారని, వేలంలో పాల్గొనేవారు ముందుగా డిపాజిట్ చెల్లించాలని కోరారు.



## బీరప్ప స్వామి ఆలయానికి భూమి పూజ

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 13 (జనంసాక్షి):**
మండలంలోని పెద్దరావుపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ బీరప్ప స్వామి, కామరతి దేవి ఆలయ నిర్మాణానికి కుర్మ సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గొల్ల కురుమ సంఘం అధ్యక్షుడు క్యామ మల్లేష్, సర్పంచ్ మోటె బాలకృష్ణ, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాక మల్లేష్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, యాదవ సంఘం నాయకుడు అయోధ్య, కుర్మ సంఘం అధ్యక్షుడు మోటె రమేష్, ఉపాధ్యక్షులు మోటె రాజు, మోటె బాల మహంకాళి, చేగూరి ప్రభాకర్, కార్యదర్శి బుడిగె అంజనేయులు, కోశాధికారి మోటె పాండు, సహాయ కార్యదర్శులు పోలెమోని విజయ కుమార్ యాదవ్, మోటె బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ వార్డు సమన్వయ కమిటీల నియామకం



**కోదాడ,( జనం సాక్షి):**
కోదాడ పట్టణ సమన్వయ కమిటీ అధ్యక్షుడు కట్టా సతీష్ మరియు ప్రధాన కార్యదర్శులు సంపేట బాలకృష్ణ ఆధ్వర్యంలో కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని కొమరబండ గ్రామంలో 10వ వార్డు తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీలను ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా చట్టు రామజినాయులు, ఉపాధ్యక్షులుగాఎస్.కె. చాంద్ పాషా ,ప్రధాన కార్యదర్శి పటాభి రామ్ ,కార్యదర్శిగా రెడ్డిబోయిన నరేష్ కోశాధికారి ఎస్.కె. పాషా నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి ప్రభాకర్, సాతులూరి గురవయ్య , కోదాటి గురవయ్య పాల్గొన్నారు.

## బొల్లంపల్లిలో గురువు కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేత

**జాజిరెడ్డిగూడెం మండల అక్టోబర్ 13 (జనంసాక్షి)**



బొల్లంపల్లి వాసి, అర్వపల్లిలోని చైతన్యభారతి విద్యామందిర్ పాఠశాల కరస్పాండెంట్ కేసాని మహేశ్వర్ ఇటీవల పాముకాటుతో అకాల మరణం చెందారు. దీంతో ఆ పాఠశాలలో విద్యనభ్యసించిన 2006-2007 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ గురువు కుటుంబానికి తమ వంతు సహాయంగా మంగళవారం రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసి బైక్ డిక్కీలో పెట్టిన వ్యాపారి.. ఫైనాన్స్ ముందు చోరీ

**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 13,(జనంసాక్షి):**
నల్లగొండ పట్టణంలో పట్టపగలే భారీ నగదు చోరీ ఘటన కలకలం రేపింది. బ్యాంకుల నుంచి రూ.4 లక్షల నగదు డ్రా చేసి తన మోటార్ సైకిల్ డిక్కీలో పెట్టుకున్న ఓ పత్తి వ్యాపారి, ఫైనాన్స్ కార్యాలయంలో పని ముగించుకుని తిరిగి వచ్చేసరికి నగదు మాయమైంది. గుర్తుతెలియని దొంగలు బైక్ డిక్కీలోని నగదును అపహరించుకుపోయినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.వివరాల్లోకి వెళితే.. కనగల్ మండలం రేగట్టె గ్రామానికి చెందిన నారా బత్తోజు శ్రీనివాస చారి (53) పత్తి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం తన గ్రామం నుంచి నల్లగొండకు వచ్చిన ఆయన, ప్రకాశం బజార్‌లో మైసయ్య విగ్రహం సమీపంలోని సెంట్రల్ బ్యాంకు నుంచి రూ.లక్ష, మిర్యాలగూడ రోడ్డులోని ఐడీఎఫ్‌సీ బ్యాంకు నుంచి మరో రూ.3 లక్షలు డ్రా చేశాడు. మొత్తం రూ.4 లక్షల నగదును తన మోటార్ సైకిల్ డిక్కీలో పెట్టుకున్నాడు.అనంతరం పాత కలెక్టరేట్ కార్యాలయం పక్కన ఉన్న ఓ ఫైనాన్స్ కార్యాలయం ఎదుట తన బైక్‌ను పార్క్ చేసి లోపలికి వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి వచ్చి చూడగా, బైక్ డిక్కీలో ఉంచిన నగదు కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు నగదును చోరీ చేసినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు సెక్టార్ ఎస్సై ఎన్. వెంకటనారాయణ కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ జి. మహాలక్ష్మయ్య దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.పట్టణంలోని రద్దీ ప్రాంతంలో, బ్యాంకుల నుంచి నగదు తీసుకొచ్చిన వ్యాపారి బైక్ డిక్కీలో ఉంచిన డబ్బులు చోరీ కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నిందితులను గుర్తించి నగదును స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## తండా ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం



**బొమ్మలరామారం అక్టోబర్ 13 (జనంసాక్షి)**
మండలంలోని సోలిపేట గ్రామపంచాయతీ పరిధిలోని రాముని తండాలో తాగునీటి సమస్యను పరిష్కరించిన పాలకవర్గం. వివరాల్లోకి వెళితే సోలిపేట గ్రామపంచాయతీ పరిధిలోని రామని తండాలో త్రాగునీటి సౌకర్యం కోసం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో గ్రామ సర్పంచ్ చిలువేరు పావని ఇంద్రసేనారెడ్డి నూతన బోరుకు మోటార్ బిగించి తండా ప్రజలకు తాగునీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తన ప్రథమ లక్ష్యమని తెలిపారు. తండాలో తాగునీటి సమస్య పరిష్కారానికి సహకరించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ కృష్ణారెడ్డి, వార్డు మెంబర్లు పూడూరి ఆంజనేయులు గౌడ్, ధీరావత్ స్వామి నాయక్, మాందాల రామకృష్ణ, రాచమల్ల అనూష, ధీరావత్ రమేష్ నాయక్, మాజీ సర్పంచ్ రెడ్డి నాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, గూగుల్ స్వామి నాయక్, సత్తిరెడ్డి, బిక్షపతి, గ్రామ ప్రజలు తండా ప్రజలు పాల్గొన్నారు.



## గోదావరి పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి రామాలయ అభివృద్ధి పనులు, గోదావరి ఘాట్లు, వైకుంఠధామం, సారపాక వంతెన ప్రాంతాల్లో జరుగుతున్న పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి.**
ఆలయ ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో చేపడుతున్న నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆలయం నుంచి గోదావరి ఘాట్లకు వెళ్లే రహదారిని 25 అడుగుల నుంచి 30 అడుగులకు విస్తరించాలని ఆదేశించారు. వైకుంఠధామానికి ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేయడంతోపాటు ప్రహరీ నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.పుష్కరాల కోసం గోదావరి ఉత్తర వైపు 270 మీటర్లు, దక్షిణ వైపు 230 మీటర్ల మేర చేపడుతున్న ఘాట్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

**పుష్పించే మొక్కలతో రహదారికి కొత్త అందాలు.**
ఐటీసీ నుంచి భద్రాచలం వంతెన వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారిని పుష్పించే మొక్కలతో సుందరీకరించేందుకు వారం రోజుల్లో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తుల వసతి కోసం డార్మిటరీ హాల్, గోశాల అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జూన్ 27 నుంచి జూలై 7 వరకు జరగనున్న పుష్కరాలకు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా, వైద్య సేవలు, పోలీసు భద్రత వంటి సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్ అండ్ బీ ఈఈ నాగేశ్వరరావు, దేవస్థానం డీఈ రవీందర్ రావు, తహసీల్దార్ రవికుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో, జీపీఈవో శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల క్రెడిట్ కోసం

## బీఆర్ఎస్ రాజకీయ డ్రామాలు!

**కాంగ్రెస్ శ్రేణులు వాస్తవాలతో తిప్పికొట్టాలి: ఓరుగంటి రమేష్‌బాబు**



**అశ్వాపురం అక్టోబర్ 13 (జనంసాక్షి):**
పినపాక నియోజకవర్గంలో అభివృద్ధి పనుల క్రెడిట్ కోసం బీఆర్ఎస్ నాయకులు రాజకీయ డ్రామాలకు తెరలేపుతున్నారని అశ్వాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌బాబు విమర్శించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషితో రోడ్లు, వంతెనల నిర్మాణాలకు హెచ్ఏఎం నిధుల కింద రూ.186 కోట్లు, పినపాక పట్టినగర్ నుంచి రాజుపేట వరకు ఆర్అండ్‌బీ రోడ్డు బీటీ పునరుద్ధరణకు రూ.76 కోట్లు మంజూరయ్యాయని, ఈ పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయని తెలిపారు.మారెళ్లపాడు ప్రాజెక్టును పూర్తి చేసి తుమ్మల చెరువును నింపిన ఘనత తమ నాయకుడిదేనని పేర్కొంటూ, ప్రాజెక్టు క్రెడిట్‌ను సొంతం చేసుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ రవాణా వల్ల రోడ్లు దెబ్బతిన్నాయని, అప్పట్లో నిర్మించిన రోడ్లు రెండేళ్లలోనే పాడవడం పనుల నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులపై అసత్య ప్రచారాలను మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ఉంటూ నిధుల మంజూరు, అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. రాజకీయ డ్రామాలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరు.. పినపాక అభివృద్ధే తమ లక్ష్యమని రమేష్‌బాబు స్పష్టం చేశారు.

## సనా ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**కోదాడ,( జనం సాక్షి):**
కోదాడలో సనా ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూల పండుగను పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు రంగురంగుల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది కళాశాల ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ చప్పట్లతో బతుకమ్మ పాటలకు ఆడి పాడారు.ఈ వేడుకలకు కళాశాల చైర్మన్ ఎండీ నజీరుద్దీన్, అకడమిక్ డైరెక్టర్ ఎండీ నౌమన్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.ఎస్. నాగప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ



సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రకృతి ఆరాధనకు నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థినులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలోనూ ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు,అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలను విజయవంతం చేశారు..

# రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో గిరిజన విద్యార్థుల పతకాల పంట!

**○ రజతం, రెండు కాంస్య పతకాలతో సత్తా చాటిన ఐటీడీఏ క్రీడా పాఠశాలల విద్యార్థులు**

**భద్రాచలం అక్టోబర్ 13 (జనంసాక్షి)**

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. నారాయణపేట జిల్లా కనుకుర్తి పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్‌లో అక్టోబర్ 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-14 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్?2026లో ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించి గిరిజన ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు.



**- ముగ్గురు విద్యార్థులకు పతకాలు**

ఉప్పుసాక ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి బి. అభిరామ్ 37 కిలోల విభాగంలో రజత పతకం సాధించాడు. అదే పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి జి. నేహాల్ 35 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. బొజ్జాయిగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన బి. అఖిల్ 44 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించి తన ప్రతిభను చాటాడు.

**- పతక విజేతలకు బహుమతుల ప్రదానం**

పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నారాయణపేట జిల్లా రెజ్లింగ్ క్రీడల సంఘం అధ్యక్షుడు నరసింహులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఆయన భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తండ్రి కావడం విశేషం. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని క్రీడా పాఠశాలల్లో విద్యనభ్యసిస్తూ రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థుల ప్రతిభ పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తూ, క్రీడారంగంలో మరింత రాణించేందుకు ప్రోత్సాహాన్నిస్తాయని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# కుమ్మరుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**నేరేడుచర్ల అక్టోబర్ 13 (జనంసాక్షి):**

కుమ్మర కులస్థుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కుమ్మర సంఘం నాయకులు కోరారు. నేరేడుచర్ల టౌన్ హాల్‌లో నేరేడుచర్ల, పాలకవీడు మండలాల కుమ్మర కులస్థుల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరులను బీసీ-బి నుంచి బీసీ-ఏలోకి మార్చాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు గంగమ్మ గుడి నుంచి టౌన్ హాల్ వరకు 200 మందికి పైగా కులస్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కుమ్మర ప్రముఖుల విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. తమ హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో నేరేడుచర్ల మండల అధ్యక్షుడిగా సిరికొండ ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా అల్వాల శ్రీధర్, పాలకవీడు మండల అధ్యక్షుడిగా టంగుటూరి అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డుపల్లి రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్లం సంజీవరావు అధ్యక్షత వహించగా, జిల్లా నాయకులు మసంపల్లి సైదులు, కుమ్మర సంఘం నాయకులు, కుల బంధువులు పాల్గొన్నారు.



# చిన్నకాపర్తిలో నూతన గ్రంథాలయం ప్రారంభం

**విద్యార్థులు, యువతకు గ్రంథాలయం విజ్ఞాన భాండాగారం: చైర్మన్ కొండ శేఖర్**

**గ్రామ అభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర కీలకం: సర్పంచ్ ఆవుల సుందర్ యాదవ్**

**చిట్యాల, అక్టోబర్ 13 (జనంసాక్షి):**

చిట్యాల మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని గ్రంథాలయ చైర్మన్ కొండ శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలని, విద్యార్థులు, యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు, పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకునేందుకు ఎంతగానో దోహద పడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆవుల సుందర్ యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు కావడం సంతోషకరమైన విషయమని అన్నారు. విద్యార్థులు, యువతతో పాటు గ్రామ ప్రజలందరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, గ్రంథాలయాన్ని వినియోగించుకుంటూ విద్యా, విజ్ఞాన రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. గ్రామంలో విద్యాభివృద్ధికి, యువతకు అవసరమైన సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో నూతన గ్రంథాలయం అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆవుల రమేష్, విపంచ ఫౌండేషన్ చైర్మన్ ఏ. శ్రీనివాస్ రెడ్డి, రుద్రరపు లక్ష్మణ్, రొండి నరసింహ, దేశపాక మధు, పల్లపు ప్రశాంత్, సత్యనారాయణ, రఘు, ఆకుల వెంకన్న వెంకన్న, ప్రజాప్రతినిధులు నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# చింతకాని అభివృద్ధికి కిలారు మనోహర్ బాబు కృషి!

**○గ్రామ ప్రగతే ధ్యేయంగా.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు!**

**చింతకాని, అక్టోబర్ 13 (జనంసాక్షి):**

చింతకాని గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సర్పంచ్ కిలారు మనోహర్ బాబు కృషి చేస్తున్నారు. ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మండల నాయకుల సహకారంతో గ్రామ ప్రగతికి అవసరమైన కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలుతో పాటు పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి:**

గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నారు.

**పేద ప్రజలకు వైద్య సేవలు అందేలా..**

గ్రామంలోని పేద, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్య శిబిరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు ఆరోగ్య పరీక్షలు, వైద్యుల సలహాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య సేవలు పొందలేని పేదలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నారు.

**గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం**

చింతకాని గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన పనులపై దృష్టి సారిస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు, గ్రామంలో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నారు.



**అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా..**

ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రజలకు ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నారు. సంక్షేమ పథకాల అమలులో అర్హులకు ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

**ప్రజా సంక్షేమమే ధ్యేయంగా..**

గ్రామ ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తూ చింతకాని సమగ్ర అభివృద్ధికి కిలారు మనోహర్ బాబు కృషి చేస్తున్నారు. మౌలిక వసతుల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారం, పేదలకు వైద్య సేవలు, సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా గ్రామ ప్రగతికి తోడ్పడుతున్నారు



# మాయమైన టేకు కలప లభ్యం.. అసలు సూత్రధారులెవరు?

**కల్లూరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మాయమైన టేకు చెట్ల కలప రఘునాథ గూడెంలో లభ్యం**

**అసలు సూత్రధారులు బయటికి రావాలంటే సమగ్ర విచారణ జరపాలంటున్నా ప్రజలు**

**కల్లూరు అక్టోబర్ 13(జనంసాక్షి)**

కల్లూరుమండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మాయమైన టేకు చెట్లు కలప రఘునాథ్ గూడెం గ్రామ శివారు పంట పొలాల సమీపంలో మంగళవారం లభ్యమయ్యాయి. టేకు చెట్ల కలప మాయమైన సంఘటనపై తల్లాడ ఆటవిశాఖ రేంజర్ ఆఫీసర్ ఉమా ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టిన ఫారెస్ట్ అధికారు లకు రఘునాథ గూడెం గ్రామ శివారు ప్రాంతంలో పంట పొలాల సమీపంలో టేకు దిమ్మలు ఉంచినట్లు సమాచారం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు డిఆర్ఓ సురేష్ కుమార్, ఎఫ్ఎస్ఓ కిషోర్, ఎఫ్ బి ఓ లావణ్య పలువురు ఫారెస్ట్ సిబ్బందితో కలిసి ప్రదేశాన్ని పరిశీలించగా టేకు దిమ్మలు లభ్యమైనట్లు డిఆర్ఓ సురేష్ కుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు. లభ్యమైన టేకు చెట్ల కలప 1. 86 క్యూబిక్ మీటర్లు ఉందని దీని విలువ సుమారు 1.95 లక్షలు అన్నారు. లభ్యమైన కలపను పంచనామా నిర్వహించి తల్లాడ ఆటవిశాఖ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై తల్లాడ ఆటవిశాఖ అధికారి ఉమా ఆదేశాల మేరకు సమగ్ర విచారణ చేపడుతున్నామని తెలిపారు.



**సూత్రధారులు ఎవరో తెలియాలంటే సమగ్ర విచారణ జరగాలి**

టేకు చెట్లు నరికి ఎత్తుకెళ్లిన వ్యక్తులు ఎవరో బయటికి రావాలంటే సమగ్ర విచారణ చేపట్టాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాల ఆవరణలో ఉన్న చెట్లు ఎవరికి తెలియకుండానే చెట్లు నరికి కల్పను తరలించారు అంటే ఇందులో ఎవరి పాత్ర ఎంత ఉంది .అసలు దీని వెనక ఎవరు ఉన్నారు అని ప్రస్తుతం కల్లూరులో చర్చ జరుగుతుంది. ఫారెస్ట్ అధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా చెట్లు నరికే అవకాశం లేదు. సామాన్యులు ఎవరైనా ఇళ్లల్లో టేకు చెట్లు పెంచుకుంటే వాటిని ఉపయోగించుకోవటానికి నరకాలంటే అధికారుల చుట్టూ తిరిగి చలానా చెల్లించి పర్మిషన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది అయినా నిబంధన ప్రకారం ఎలాంటి అనుమతులు లేకుండా స్థానిక అధికారులకు తెలియకుండా ఆవరణలో చెట్లు నరకడం అంటే ఇది సాధ్యమయ్యే పనేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. నిజ నిజాలు తేలాలంటే విస్పక్షపాతంగా విచారణ జరిపించి, మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జనంసాక్షి

# వంద మంది పట్టభద్రులకు ఒక కార్యకర్త



- ఎమ్మెల్సీ ఎన్నికలకు గులాబీ దళం కార్యాచరణ!
- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు దిశానిర్దేశం..

**భద్రాచలం అక్టోబర్ 13 (జనంసాక్షి)**
రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ శ్రేణులు ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి సారించాయి. ప్రతి వంద మంది పట్టభద్రులకు ఒక కార్యకర్తను సమన్వయకర్తగా నియమించి, అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు వెల్లడించారు. మంగళవారం భద్రాచలం లోని తెలంగాణ టూరిజం హోటల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాంప్రసాద్, నాయకుడు మానే రామకృష్ణతో పాటు పలువురు నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

**- పట్టభద్రుల నమోదుపై ప్రత్యేక దృష్టి**
ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలను సేకరించి, ఓటరుగా నమోదు చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రతి వంద మంది పట్టభద్రులకు ఒక కార్యకర్త బాధ్యతలు అప్పగించి, సమన్వయంతో పనిచేసేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

**- నమోదు వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలి**
ఆన్‌లైన్ ద్వారా ఓటర్లుగా నమోదు చేయించిన పట్టభద్రుల వివరాలను పార్టీ ప్రత్యేక యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని నాయకులకు సూచించారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల ఇన్‌ఛార్జులు తమ పరిధిలోని ప్రాంతాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించి, అర్హులైన పట్టభద్రులందరి నమోదు పూర్తయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని, ఎన్నికలు ముగిసే వరకు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, మండల బాధ్యులు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విపత్తుల నివారణపై అవగాహనతోనే ప్రాణనష్టం అరికట్టవచ్చు

**ప్రియదర్శిని కళాశాలలో అవగాహన కార్యక్రమం.. విద్యార్థినుల ర్యాలీ**

**ఖమ్మం రూరల్,అక్టోబర్ 13(జనంసాక్షి):**
విపత్తుల నివారణపై అవగాహనతో పాటు ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు అన్నారు. అంతర్జాతీయ విపత్తుల ప్రమాదాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేరా యువ భారత్?ఖమ్మం, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా నవీన్ బాబు మాట్లాడుతూ విద్యార్థినులు విద్యతోపాటు సామాజిక బాధ్యతను అలవరచుకుని ప్రజల్లో విపత్తుల నివారణపై చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తుల గోపాల్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో భయాందోళనలకు గురి కాకుండా అధికారుల సూచనలు పాటిస్తూ బాధితులకు సహాయం అందించాలని సూచించారు.ముఖ్య అతిథి, కొత్తగూడెం ఎస్‌డీఆర్ఎఫ్ ప్రతినిధి టి. వెంకటేష్ విపత్తుల సమయంలో చేపట్టాల్సిన రక్షణ చర్యలను ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, భూకంపాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మేరా యువ భారత్?ఖమ్మం అకౌంట్స్ అధికారి కె. భాను చందర్, కళాశాల అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకట రమణ యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు.ఆపదమిత్ర శిక్షణ పొందిన ఎస్. భార్గవి, జి. శిరీష విపత్తుల నివారణపై అవగాహన కల్పించగా, వారి సేవలను కళాశాల యాజమాన్యం అభినందించింది. విద్యార్థినులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విపత్తుల నివారణ, ప్రజల భద్రతపై సందేశాలతో విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివరామకృష్ణ, యువజన సంఘ సభ్యుడు ఎం.డి. షరూక్ ఇమ్రాన్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.






# కల్లూరు మున్సిపాలిటీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**కల్లూరు అక్టోబర్ 13(జనంసాక్షి)**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. పూల బతుకమ్మలతో వేడుకల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ , కమిషనర్ సాయి కృష్ణారెడ్డి, కల్లూరుఏఎంసీ మాజీ చైర్మన్ భాగం నీరజాదేవి తదితరులు ప్రసంగించారు , బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మహిళలు ఐకమత్యంతో, ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ వేడుకలను జరుపుకోవడం సంతోషకరమని తెలిపారు.

బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా, మహిళల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొట్రు అర్జున్ రావు , పట్టణ కమిటీ అధ్యక్షులు షేక్ ఉస్మాన్ ,మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి , కౌన్సిలర్లు జిల్లెల్ల స్వాతి భాస్కర్ రెడ్డి, బీరెల్లి మాధవ్ , యాస నాగమణి శ్రీకాంత్ ఉబ్బన రాంబాబు రాధా ఖమ్మంపాటి వీరస్వామి మున్సిపల్ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు వార్డు అధికారులు సరోజిని , తనుజ , సుధారాణి మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

- ఒకే కుటుంబంలో వరుస విషాదాలు
- చిన్న కుమార్తె మృతి తర్వాత కుటుంబ పెద్దను కోల్పోయిన వైనం

**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 13 (జనం సాక్షి)**



మండలంలోని జానకిపురం గ్రామానికి చెందిన నూనె శ్రీనివాసరావు (37) చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. చిన్న కుమార్తె గత నెలలో మృతి చెందగా, కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న శ్రీనివాసరావు కూడా మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావు కొంతకాలంగా కడుపునొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో అక్టోబర్ 8న మధ్యాహ్నం మద్దుకూరు గ్రామ సమీపంలోని ఓ దేవస్థానం వద్ద పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.
అక్కడ చికిత్స పొందుతూ అక్టోబర్ 12న రాత్రి సుమారు 10 గంటల సమయంలో శ్రీనివాసరావు మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు అన్నపురెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, హెడ్ కానిస్టేబుల్ పి. రవికుమార్ కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, ఘటనపై తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**వరుస విషాదాలతో కుటుంబంలో తీరని శోకం**
గత నెలలో చిన్న కుమార్తెను కోల్పోయిన ఆ కుటుంబం, నెల తిరగకముందే కుటుంబానికి అండగా ఉన్న శ్రీనివాసరావును కూడా కోల్పోవడంతో తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఒకవైపు కుమార్తె మరణం.. మరోవైపు కుటుంబ పెద్ద మృతి ఆ కుటుంబ సభ్యులకు తీరని వేదనను మిగిల్చింది. ఈ ఘటనతో గ్రామంలోనూ విషాద వాతావరణం నెలకొంది.

# గ్రామంలో రీసర్వే పనులను పకడ్బందీగా పూర్తి చేయాలి

## అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

- భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలి
- రీసర్వేలో తప్పులకు లేకుండా భూ వివరాల నమోదుచేయాలి

**ఖమ్మం, అక్టోబర్ 13(జనం సాక్షి )**
భూముల రీసర్వే పనులను పకడ్బందీగా, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.
మంగళవారం పెనుబల్లి మండలం తుమ్మలపల్లి రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ రికార్డుల్లోని వివరాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని ఆదేశించారు.రీసర్వే ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. భూములకు సంబంధించిన వివరాలపై అభ్యంతరాలు లేదా సందేహాలు వ్యక్తమైతే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.సంబంధిత అధికారులు రీసర్వే పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, రోజువారీ పురోగతిని సమీక్షించాలని, పనుల్లో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట పెనుబల్లి తహశీల్దార్ వీరభద్ర నాయక్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

## మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి



రామన్నపేట, అక్టోబర్ 13 (జనంసాక్షి): గ్రామ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా కామినేని హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఎడ్ల మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలోని రైతు వేదిక ప్రాంగణంలో కామినేని హాస్పిటల్స్ ఎల్బీనగర్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి సందర్శించి వైద్య సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కామినేని హాస్పిటల్స్ నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మంగళంపల్లి గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలు, జ్వరం, జలుబు, నొప్పులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి అనంతరం అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# లిఫ్టులకు నిరంతరం నాణ్యమైన కరెంటు ఇవ్వాలి

○ మేదరమట్ల వెంకటేశ్వరరావు డిమాండ్

మునగాల, అక్టోబర్ 13(జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం నాగార్జునసాగర్ ఎడమ కాలవ నీటిని విడుదల చేసిన నేపథ్యంలో చెరువులు కుంటలు నింపేందుకు లిఫ్టులకు 24 గంటల కరెంటు అందించాలని లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ మేదరమెట్ల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సరైన కరెంటు రాకపోవడంతో లిఫ్టుల ద్వారా చెరువులు కుంటలు లిఫ్ట్ మోటార్ల ద్వారా నింపటం అసాధ్యమని, ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి 24 గంటల నాణ్యమైన కరెంట్ అందించాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం ఎల్ 30, 31 లిఫ్ట్ ఇరిగేషన్ ఆయకట్టు రైతుల సమావేశం లిఫ్ట్ ఫస్ట్ స్టేజ్ వద్ద జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తీవ్ర వర్షాభావ ప్రభావం వల్ల వేసిన పంట చేతికి రాక చిరు పొట్ట దశలో ఎండిపోయే పరిస్థితి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసినప్పటికీ అస్తవ్యస్త కరెంటుతో లిఫ్ట్ మోటర్లు సరిగా నడవడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులు జోక్యం చేసుకొని ఈ 15 రోజులపాటు నిరంతరాయంగా 24 గంటలు కరెంటు సప్లై చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆయకట్టు లిఫ్ట్ ఇరిగేషన్ రైతులు కొక్కిరేణి గ్రామ సర్పంచ్ దాసరి శ్రీను, ఎర్రం వెంకటరెడ్డి, నందిగామ సైదులు, చనగాని సాంబయ్య, మాజీ సర్పంచ్ రావులపెంట వెంకన్న, నిడిగొండ శంబయ్య, రేఖ లింగయ్య, సింగం రమేష్, మిరియాల సైదులు, వాసా వెంకన్న, మాతంగి నారాయణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలి

○ ఈ నెల 25లోగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి..

○ బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే చంద్రావతి దిశానిర్దేశం



ఖమ్మం రూరల్, అక్టోబర్ 13(జనంసాక్షి): రానున్నా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలని వైరా మాజీ ఎమ్మెల్యే బి. చంద్రావతి సూచించారు. అర్హులెవరూ నమోదు ప్రక్రియకు దూరం కాకుండా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో మంగళ వారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 26వ డివిజన్‌లో బీఆర్ఎస్ నేత బానోతు కృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి అర్హులైన గ్రాడ్యుయేట్ల వివరాలు సేకరించి, నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ప్రాధాన్యాన్ని ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులకు వివరించారు. అనంతరం కృష్ణ క్యాంపు కార్యాలయంలో ఇప్పటివరకు జరిగిన ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్షించారు. ఈ నెల 25లోగా అర్హులైన గ్రాడ్యుయేట్లందరి నమోదు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులను నేరుగా కలిసి ఓటరు నమోదుకు అవసరమైన వివరాలు సేకరించాలని సూచించారు. ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్ విధానంలోనూ నమోదు ప్రక్రియను సమన్వయంతో చేపట్టాలని చెప్పారు. సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన గ్రాడ్యుయేట్లను సైతం సంప్రదించి, వారి వివరాలు సేకరించి నమోదు చేయించాలని స్పష్టం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం ప్రత్యేక సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంటూ, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నమోదు ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, సమన్వయంతో పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నేత బానోత్ జ్యోతి, బానోత్ కృష్ణ, అన్వేష్, స్థానిక యువకులు, ఉద్యోగులు, ఇతరులు పాల్గొన్నారు.

# కోర్టుకు వరుసగా గైర్హాజరు నిందితుడి అరెస్ట్



కొండ మల్లేపల్లి, అక్టోబర్ 13 (జనంసాక్షి): కోర్టు విచారణకు వరుసగా గైర్హాజరవుతూ తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని దేవరకొండ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. గుండ్లపల్లి మండలం కుందేల్‌బాయి తండాకు చెందిన కత్రావత్ బాలు (తండ్రి హర్యా)పై 2021లో గుడుంబా తయారీకి సంబంధించి కేసు నమోదైంది. ఈ కేసులో కోర్టుకు వరుసగా 10 సార్లు గైర్హాజరు కావడంతో న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో ఎక్సైజ్ ప్రత్యేక బృందం నిందితుడిని పట్టుకుని అరెస్ట్ చేసింది. అతని వద్ద అక్రమ మద్యం తయారీకి నిల్వ ఉంచిన నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ ఎస్‌హెచ్ఓ తెలిపారు.



# అన్నపూర్ణాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

సూర్యాపేట (జనంసాక్షి): సకల మానవాళికి ఆకలి తీర్చే పరబ్రహ్మ స్వరూపమైన అన్న ప్రసాదాన్ని వరముగా అందించే అన్నపూర్ణాదేవి అలంకారాన్ని దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గామాత దర్శనార్థం సిద్ధం చేయడం జరిగిందని శాంతినగర్ శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ ఉప్పల గురునాథం తెలిపారు. మంగళవారం పూజ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీర్లపాటి వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యాన్నదానేశ్వరి అలంకారంలో ఉన్న దుర్గమ్మను దర్శించిన వారికి మేధాశక్తి కలుగుతుందని తెలిపారు. అమ్మవారిని ధ్యానిస్తే ధన, ధాన్య, ఐశ్వర్య సిద్ధి కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుండా రమేష్, తల్లాడ వెంకటేశ్వర్లు, నూనె యుగంధర్, ఉప్పల దినేష్, జనార్దన్, సంతోష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ పట్టభద్రుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

○ యువతకు ఉపాధి కల్పించాలి : డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ డిమాండ్

○ ప్రతి నెలా ఉద్యోగ మేళాలు నిర్వహించాలి

○ భవానీ మాత దీక్షలో బీసీవై పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడి డిమాండ్



చౌటుప్పల్ అక్టోబర్ 13(జనంసాక్షి) ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని యువతకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీసీవై పార్టీ తెలంగాణ రాష్ట్ర పీఏసీ సభ్యులు, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. భవానీ మాత దీక్షలో ఉన్న ఆయన, నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి పలు డిమాండ్లను విజ్ఞప్తి చేశారు. ఉద్యోగాల భర్తీ పారదర్శకత ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ఉద్యోగ నోటిఫికేషన్లు, పరీక్షలు, నియామక ప్రక్రియలను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలి. జిల్లాల వారీగా నిరుద్యోగ పట్టభద్రుల గణాంకాలను వెల్లడించి, స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలి. స్థానికులకే ప్రాధాన్యత పరిశ్రమల స్థాపనకు మౌలిక వసతులు కల్పిస్తూనే, ప్రైవేటు కంపెనీల్లో స్థానిక యువతకు ప్రాధాన్యతనిచ్చేలా స్పష్టమైన విధానాన్ని రూపొందించాలి. పరిశ్రమలకు ఇచ్చే ప్రోత్సాహకాల్లో స్థానిక ఉపాధిని తప్పనిసరి ప్రమాణంగా చేర్చాలి. నెలవారీ ఉద్యోగ మేళాలు ప్రతి జిల్లా కేంద్రంలో, అవసరమైతే నియోజకవర్గ స్థాయిలోనూ ప్రతి నెలా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఉద్యోగ మేళాలు నిర్వహించాలి. వీటి వివరాలను ముందుగానే అధికారికంగా వెల్లడించి, ఎంపికైన అభ్యర్థులు వాస్తవంగా ఉద్యోగాల్లో చేరారా లేదా అనే విషయాన్ని ప్రభుత్వం పర్యవేక్షించాలి. ఉచిత కోచింగ్ స్వయం ఉపాధి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉచిత కోచింగ్, స్టడీ మెటీరియల్, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు కల్పించాలి. స్వయం ఉపాధి ప్రారంభించే పట్టభద్రులకు బ్యాంకు రుణాలు, సబ్సిడీలు, మార్కెటింగ్ మార్గదర్శకత్వం అందించడానికి ప్రత్యేక కెరీర్ మార్గదర్శక కేంద్రాలను ఏర్పాటు చేయాలి. నిరుద్యోగ భృతిపై స్పష్టత ఎన్నికల హామీల్లో పేర్కొన్న నిరుద్యోగ భృతి అమలు స్థితి, అర్హతలు, చెల్లింపులపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి. యువత పథకాల కోసం ఒకే పోర్టల్‌ను అందుబాటులోకి తేవాలి. వలసల నివారణ మహిళలు, దివ్యాంగులు, గ్రామీణ వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక అవకాశాలు కల్పిస్తూ.. స్థానికంగా పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రామీణ యువత వలసలను అరికట్టాలి. పట్టభద్రుల సమస్యలను శాసన మండలిలో బలంగా ప్రస్తావించేందుకు, యువతకు న్యాయం జరిగేలా నిరంతరం పోరాడేందుకు తాను కట్టుబడి ఉన్నానని డాక్టర్ చిలకల శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

# హుజూర్ నగర్ లో ఆక్రమణలపై కఠిన చర్యలు

**రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చలానాలు... కేసులు నమోదు**

**పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ గజ్జె. చరమందరాజు**



**హుజూర్‌నగర్ అక్టోబర్ 13(జనంసాక్షి):** పట్టణంలో రహదారులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. సిఐ చరమంద రాజు ఆదేశాల మేరకు ఎస్ఐలు చలి కంటి నరేష్, హనుమా నాయక్ కలిసి ఆక్రమణలపై చర్యలు చేపట్టారు. రోడ్లపై తోపుడు బండ్లు ఏర్పాటు చేయడం, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం, దుకాణాల ఎదుట బోర్డులు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై చలానాలు విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నారు. మంగళవారం ఆటో కార్మికుడు మృతి ఘటన నేపథ్యంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్యలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. రహదారుల ఆక్రమణల వల్ల పాదచారులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు చర్యలు ముమ్మరం చేశారు. రహదారులను ఆక్రమించి ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు. వ్యాపారులు నిబంధనలు పాటించాలని, ఫుట్‌పాత్‌లు, రహదారులను ఆక్రమించవద్దని సూచించారు. పట్టణంలో పాత బస్టాండ్, శాంతి స్తూపం, ఇందిరా చౌక్ లలో ప్రతిరోజు ఉదయం వేళల్లో కూలీలు (జాతర)ను తలపించే విధంగా రోడ్లు కిక్కిరిసిపోతున్నాయని వారి కోసం ప్రత్యామ్నాయ మార్గాలు (అడ్డా) చూపాలని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడటమే లక్ష్యంగా పోలీసు శాఖ చర్యలు కొనసాగిస్తోంది. ఆక్రమణల నియంత్రణకు వ్యాపారులు సహకరించాలని పోలీసులు కోరారు.



## తెలంగాణ ఎంఆర్‌పీఎస్ అంగడిపేట గ్రామ శాఖ అధ్యక్షుడిగా మద్దిమడుగు వసంత్ కుమార్

*మాదిగల హక్కుల సాధనకు,సామాజిక న్యాయం కోసం నిరంతర పోరాటం*

**పి.ఏ.పల్లి, అక్టోబర్ 13 (జనంసాక్షి):** తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) అంగడిపేట గ్రామ శాఖ అధ్యక్షుడిగా మద్దిమడుగు వసంత్ కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ శాఖ అధ్యక్షుడికి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మాదిగ సామాజిక వర్గ అభ్యున్నతికి,హక్కుల సాధనకు,సంఘటిత శక్తిని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పోతేం సహదేవుడు,దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి,పి.ఏ.పల్లి మండల అధ్యక్షుడు దున్న ముత్యాలు,వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దిమడుగు కరుణయ్య,మండల ప్రధాన కార్యదర్శి కంబాలపల్లి రామస్వామి,గుడిపల్లి మండల అధ్యక్షుడు వంశీ,ప్రధాన కార్యదర్శి మైసం కిషన్,మండల అధికార ప్రతినిధి బోడ నాగరాజు, ఆదాసు రమేష్,ఇరిగి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి



**కోదాడ,( జనంసాక్షి):** సర్ ను రద్దు చేయాలని, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పి డి ఎస్ యు, పి వై ఎల్ ఆధ్వర్యంలో 15న జరిగే ఎలక్షన్ కమిషనర్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్గొండ నాగయ్య, డి రవి పిలుపునిచ్చారు. స్థానిక లాల్ బంగ్లాలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. మూడో విడత సర్ ముసాయిదా ఓటరు జాబితాలు విడుదలయ్యే నాటికి దేశవ్యాప్తంగా 13 కోట్లకు పైగా ప్రజల పేర్లు ఓటరు జాబితాల నుంచి తొలగించబడ్డట్లు తెలిసిన విషయమే తెలంగాణ రాష్ట్రంలో కూడా సుమారు 73 లక్షల 39 వేల ఓట్లను తొలగించినట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. బిజెపి యేతర రాష్ట్రాలలో ఓట్లను తొలగించడం జరుగుతుందని అన్నారు. తొలగించిన ఓట్లకు బాధ్యత వహిస్తూ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా గత నెల రోజులుగా విద్యార్థి, యువత రోడ్లపై కొచ్చి ఉద్యమాలు నిర్వహిస్తుంటే కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని అన్నారు. అక్టోబర్ 10 వ తారీఖున ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద శాంతి యుతంగా నిరసన తెలియ జేయడానికి సిద్ధమైన ఉద్యమ కారులను అణిచివేయడం కోసం దేశ నగరమైన ఢిల్లీలో ఉన్న సుమారు 45 మెట్రో రైల్వే స్టేషన్లను మూసివేస్తూ నిత్యవసర రవాణాలను కూడా నిలిపివేసి ప్రభుత్వం యొక్క మొండి వైఖరిని మరోసారి దేశానికి తెలియజేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే 237 రైళ్ల రాకపోకలను నిలిపివేయడం అంటే ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే ఓటు హక్కును కాలరయటమంటే భారత రాజ్యాంగంపై పరోక్షంగా కేంద్ర ప్రభుత్వం దాడి నిర్వహిస్తుందని మండిపడ్డారు. ఓట్లను కోల్పోయిన జాబితాలో ముఖ్యంగా ఆదివాసులు, దళితులు, మైనార్టీలు, మహిళలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్న వారి యొక్క ఓట్లనే తొలగించడం అంటే ప్రభుత్వం ఈ వర్గాల ప్రజల ఓటు హక్కును కుట్రపూరితంగా తొలగించిందని అన్నారు. చనిపోయిన వారిని మినహాయించి తొలగించిన ఓట్లన్నీ పునరుద్ధరించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి ప్రజాస్వామ్యం లో ఓటు హక్కును కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తున్న ఎన్నికల విధానాన్ని సంస్కరణ చాలి, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత ఉండాలి, ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలని, ఎస్.ఐ. ఆర్ ను రద్దు చేయాలని, చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయాన్ని ముట్టడి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ముట్టడికి విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొ నాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి వి రమేష్, జిల్లా కోశాధికారి బండి రవి, జిల్లా ఉపాధ్యక్షులు గిరిబాబు, మున్నా అశోక్, పొన్నం బ్రహ్మం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణగూడెంలో ఇందిరమ్మ ఇళ్లపట్టాలు అందజేత

**మునగాల, అక్టోబర్ 13(జనంసాక్షి):** మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించిన పత్రాలను గ్రామ సర్పంచ్ కాంపాటి వెంకట్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాంపాటి వెంకట్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నరేష్, ఉపసర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, వార్డ్ సభ్యులు, గ్రామపెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ



**మునగాల, అక్టోబర్ 13(జనంసాక్షి):** మండల పరిధిలోని నరసింహాపురం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఇటీవల ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులకు ఇళ్లపట్టాలను గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ, మునగాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర్ల కోటయ్య ఆధ్వర్యంలో మంగళవారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పేదలకు అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కల సహకారం చేయడం సంతోషమని, అలాగే ఎన్నో ఏళ్లుగా సరైన ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు మంజూరు చేయడం సంతోషంగా ఉందని, అలాగే స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గార్ల సహకారంతో మిగిలిపోయిన అర్హత గల వారికి రాబోయే రోజుల్లో ఇళ్ల మంజూరుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా అర్హులైన పదిమందికి ఇళ్ల పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీఓ నరేష్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఉపసర్పంచ్ రెడ్డబోయిన ప్రశాంత్, గ్రామ శాఖ అధ్యక్షులు గుండు లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు షేక్ అజీజ్ మియా, కేసకాని కామేశ్వరి వెంకన్న, రేపూరి కళ్యాణి బాబు, మిసాల బిక్షం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒరుగంటి రవి, కాలె సామేలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, గ్రామ పెద్దలు మహిళలు యువత తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి నీటి చుక్క భవిష్యత్ తరాలకు ఆస్తి : సర్పంచ్ వేమూరి సత్యనారాయణ

**మునగాల, అక్టోబర్ 13(జనంసాక్షి):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని మండల పరిధిలోని నరసింహాపురం గ్రామంలో మంగళవారం వినూత్నంగా మంగళ వాయిద్యాలతో, మహిళలతో, కుంకుమ బొట్టు, గందం పెట్టి ఇంటింటి ప్రచారం గ్రామ సర్పంచ్ వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. గ్రామంలో ఉన్న ప్రతివీధిలో కార్యక్రమం యొక్క విశిష్టతను తెలియజేస్తూ, ఆడపడచులకు కుంకుమ తిలకంతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం వల్ల తీవ్ర వర్షాభావ పరిస్థితులు తలెత్తాయని, తీవ్ర ఎండలు ఉన్నాయని, గ్రామస్తులు రైతులు జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటిలో ఒక ఇంకుడు గుంట ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట, బోర్ బావులకు రీఛార్జ్ నిర్మాణాలు చేసుకోవాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ లో నీటి కొరత రాకుండ ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఇంటిలో ఒక ఇంకుడు గుంటను ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి మన భవిష్యత్ ను, రాబోయే తరాల వారి భవిష్యత్ ను రక్షించుకోవలసిన భాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఈ కార్యక్రమంలో పార్టీలకతీతంగా, రాజకీయాలకతీతంగా మనమందరం భాగస్వాములం కావాలని, అందరి సమిష్టి భాధ్యతతో ఎల్ నినో వంటి ప్రమాదాన్ని గుర్తించి మనల్ని మనమే రక్షించుకోవటానికి కంకణబద్దులమై ఉందామని అన్నారు. ముఖ్యంగా రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి. వారి వారి పంట పొలాల్లో, ఫారం పాండ్లు, చేపల చెరువులు, నీటి కుంటలు తీసుకుని గ్రామ ప్రజలకు, పేదలకు, ఉపాధి కల్పించేందుకు సహకరించాలని, ప్రతి పేదవాడికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఏడాదిలో 125 రోజులు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళతామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జలసిరి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, గ్రామస్తులందరూ ఏకతాటిపైకి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. అంతేగాకుండా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో వినూత్నమైన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అన్నారు. ప్రజలందరూ సహకరించి ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీఓ నరేష్, వి బి జి ఆర్ జి పథకం టెక్నికల్ అసిస్టెంట్ శ్రీధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్ రెడ్డబోయిన ప్రశాంత్, వార్డ్ సభ్యులు షేక్ అజీజ్ మియా, కేసగాని కామేశ్వరి వెంకన్న, రేపూరి కళ్యాణి బాబు, మిసాల బిక్షం, గ్రామ పెద్దలు బొమ్మ చిన్నవెంకన్న, కారంగుల సైదులు, వీరబోయిన వినోద్, కిన్నెర హరీష్, మనోజ్ రేపూరి బాబు, మిసాల రామ్మూర్తి, నారయ్య, వెంకటేశ్వర్లు, సమీనా, బొమ్మ స్వాతి, మహిళలు యువత గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి : సయ్యద్ ఫఖ్రుద్దీన్ అలీ అహ్మద్



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 13 (జనంసాక్షి)**
యువతలో క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యతా భావాలను పెంపొందించడంతో పాటు వారి సమయం, ప్రతిభ, శక్తిని సమాజ సేవకు, దేశ అభ్యున్నతికి వినియోగించే లక్ష్యంతో ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ పనిచేస్తుందని రాష్ట్ర కోఆర్డినేటర్ సయ్యద్ ఫఖ్రుద్దీన్ అలీ అహ్మద్ అన్నారు. నేడు జమాఅతె ఇస్లామి హింద్ కార్యాలయంలో హైదరాబాద్ లో నవంబర్ 22 న జరిగే రాష్ట్ర సదస్సు గోడ పత్రికను విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర సదస్సుకు అధిక సంఖ్యలో యువకులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. యువత తమను తాము మార్చుకోవడంతో పాటు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడాలని అన్నారు. వ్యక్తిత్వ నిర్మాణం, సేవా భావం, కరుణ, న్యాయం, నిజాయితీ, క్రమశిక్షణ వంటి విలువలను యువత తమ జీవితాల్లో ఆచరించాలని పిలుపునిచ్చారు. “మిమ్మల్ని మీరు మార్చుకోండి ? సమాజాన్ని మార్చండి ? దేశాన్ని నిర్మించండి” అనే సందేశంతో యువతలో చైతన్యం తీసుకురావడం సదస్సు ప్రధాన లక్ష్యంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఉభయ జిల్లాల ఐవెఎం కోఆర్డినేటర్ తాజాద్దీన్ ఖాన్ జమాతే ఇస్లామీ హింద్ కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు షరీఫ్ ఖమం నగర అధ్యక్షులు జైనుల్ పాషా, జమాఅతె ఇస్లామి హింద్ సెంట్రల్ ఇంచార్జ్ అధ్యక్షులు అబ్దుల్ మలిక్ ,సౌత్ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, నార్త్ ఇంచార్జ్ అధ్యక్షులు అబ్దుల్ ముజీబ్ వెస్ట్ అధ్యక్షులు అబ్దుస్ సుబుర్, స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ పట్టణ అధ్యక్షులు అబ్దుల్ మతిన్ ఐవెఎం పట్టణ కోఆర్డినేటర్ సయ్యద్ ఇమాదద్దీన్ మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## అటవీ సంపద పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

### మద్దుకూరు ఈస్ట్ బీట్‌లో 30 హెక్టార్ల మొక్కల పెంపకం పరిశీలన



**చంద్రుగొండ, అక్టోబర్ 13 (జనంసాక్షి):**
అటవీ విస్తీర్ణాన్ని పెంపొందిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ భీమా నాయక్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ అటవీ పరిధిలోని మద్దుకూరు విభాగం, మద్దుకూరు ఈస్ట్ బీట్‌లో చేపట్టిన 30 హెక్టార్ల మొక్కల పెంపకాన్ని మంగళవారం వారు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకం నిర్వహణ, వాటి సంరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపునకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. మొక్కల పెంపకం లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేస్తూ అటవీ సంపదను కాపాడాలని అటవీ అధికారులకు సూచించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవుల పాత్ర కీలకమని పేర్కొంటూ, అటవీ విధ్వంసానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చంద్రుగొండ అటవీ క్షేత్రాధికారి కె. తేజస్వి, ఉప అటవీ క్షేత్రాధికారి కె. లక్ష్మీపతి, ఇతర అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## రీసర్వే పనులను పకడ్బందీగా పూర్తి చేయాలి

### అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 13(జనంసాక్షి )**
జిల్లాలో భూముల రీసర్వే పనులను పకడ్భందీగా, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.
మంగళవారం పెనుబల్లి మండలం తుమ్మలపల్లి రెవెన్యూ గ్రామం, కల్లూరు మండలం రఘునాధగూడెం రెవెన్యూ గ్రామం, తల్లాడ మండలం లక్ష్మీపురం రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా గ్రామాల్లో సర్వే పనుల పురోగతిని సమీక్షించి, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ× రీసర్వేలో భాగంగా భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ రికార్డుల్లోని వివరాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. రీసర్వే ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. భూములకు సంబంధించిన వివరాలపై అభ్యంతరాలు లేదా సందేహాలు వ్యక్తమైతే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట తల్లాడ, పెనుబల్లి, కల్లూరు తహశీల్దార్లు కె. కరుణాకర్ రెడ్డి, జి. వీరభద్ర నాయక్, కె. బ్రహ్మేశ్వర రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తాం : మార్కెట్ చైర్ పర్సన్ చలసాని స్పందన రాజీవ్



**నేరేడుచర్ల అక్టోబర్ 13 (జనంసాక్షి)**
ఈ నెల 15 తేదీన నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వైస్ చైర్మన్,పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యమానికి నేరేడుచర్ల, పాలక వీడు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకట్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం నేరేడుచర్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో చలసాని స్పందన రాజీవ్ మాట్లాడుతూ నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి, పాలక వీడు నేరేడుచర్ల మండలాల కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని,తమ పై అప్పగించిన బాధ్యతను స వ ం ర్ధ వ ం త ం గా నిర్వహిస్తామని, తమకి సహకరించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ,నేరేడుచర్ల పాలక వీడు మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు చలసాని శ్రీనివాస్ రావు, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, డైరెక్టర్లు ,మాజీ మున్సిపల్ ఛైర్మన్ బచ్చలకురి ప్రకాష్, మున్సిపల్ కౌన్సిలర్స్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి.. సోదరుడికి గాయాలు

**వలిగొండ, అక్టోబర్ 13 (జనం సాక్షి)**
వలిగొండ?తొర్రూరు హైవేపై పల్లెర్ల స్టేజీ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధరావత్ చందర్ (42) మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చందర్ తన సోదరుడు చందుతో కలిసి స్ప్లెండర్ ప్లస్ మోటార్ సైకిల్‌పై కూలీ పనుల నిమిత్తం జంగారెడ్డిపల్లికి వెళ్తుండగా, మార్గమధ్యంలో రోడ్డుపై వెళ్తున్న బర్రెను బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న చందర్ కిందపడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న చందుకు గాయాలు కావడంతో వలిగొండలోని రేణుకాదేవి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య యాకమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు

**కనగల్లు, అక్టోబర్ 13 (జనంసాక్షి)** ధర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి సన్నిధిలో నల్లగొండ జాయింట్ కలెక్టర్ జె శ్రీనివాస్ సతీమణి ఇందిర కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. డైరెక్టర్ ఆఫ్ జనరల్ సిసి అన్వేష్ రెడ్డి, మిషన్ భగీరథ గుత్తేదార్ బండ మల్లారెడ్డిలు అమ్మవారి దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వారికి సాంప్రదాయ రీతిలో శాల్వా కప్పి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఎస్సై కే రాజీవ్ రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సునీత, ఆలయ ప్రధాన అర్చకులు నాగోజు మల్లాచారి, శ్రవణ్ కుమార్చార్యులు ప్రవీణ్ కుమార్ ఆచార్యులు ఉమామహేశ్వరరావు, సిబ్బంది కూసం ఉపేందర్ రెడ్డి, జిపిఓ, అస్లాం, ఆలయ సిబ్బంది ఉన్నారు.

## 25 ఏళ్లుగా మౌలిక వసతులకు నోచుకోని చింతకుంట!

- ○ రోడ్డు, విద్యుత్, తాగునీటి సమస్యలపై క్షేత్రస్థాయిలో ఎంపీడీవో పరిశీలన.
- ○ ఎమ్మెల్యే పాయం ఆదేశాలతో గ్రామ సందర్శన..
- ○ సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులకు నివేదిక..

**బూర్గంపహాడ్ అక్టోబర్ 13 (జన్మసాక్షి)**
రెండు దశాబ్దాలకు పైగా నివాసం ఉంటున్నా.. కనీస మౌలిక వసతులు అందక ఇబ్బందులు పడుతున్న ఆదివాసీ గిరిజనుల సమస్యలపై అధికారులు స్పందించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు బూర్గంపహాడ్ ఎంపీడీవో జమలారెడ్డి, మోతె గ్రామపంచాయతీ సర్పంచ్ సూరమ్మ, హౌసింగ్ బోర్డు ఏఈ ఉదయ్ కిరణ్ మంగళవారం మోతె గ్రామపంచాయతీ పరిధిలోని చింతకుంట, శ్రీరాంపురం పాయం ఎస్టీ కాలనీలను సందర్శించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆదివాసీల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

**- 25 ఏళ్లుగా ఎదురుచూపులే!..**
చింతకుంట గ్రామంలో సుమారు 25 ఏళ్లుగా నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు ఇప్పటికీ రోడ్లు, విద్యుత్ వంటి కనీస సదుపాయాలు అందలేదని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గతంలో పలువురు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు తమ సమస్యలను విన్నవించగా, ఆయన వెంటనే స్పందించి గ్రామాన్ని సందర్శించి పూర్తి వివరాలతో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

**- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..**
గ్రామస్థుల సమస్యలను ఉన్నతాధికారులతో పాటు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని ఎంపీడీవో జమలారెడ్డి హామీ ఇచ్చారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పంచాయతీ కార్యదర్శి సావిత్రికి సూచించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.



**- తాగునీటి నాణ్యతపై పరీక్షలు..**
బోరుబావి నీటిలో సున్నం వంటి పదార్థాలు వస్తున్నాయని గ్రామస్థులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన నీటి నమూనాలను పరీక్షించి, సమస్యకు కారణాలను గుర్తించి, ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని తమ సమస్యలను అధికారులు స్వయంగా గ్రామానికి వచ్చి పరిశీలించడంపై గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. రోడ్లు, విద్యుత్, తాగునీటి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు ఏఈ ఉదయ్ కిరణ్, మోతె పంచాయతీ కార్యదర్శి సావిత్రి, ఉపసర్పంచ్ మోడం రాధాకృష్ణ, టీఆర్ఎస్ నాయకుడు గుదే రామకృష్ణ, శ్రీరాంపురం పాయం ఎస్టీ కాలనీ పెద్దమనిషి సోడే చంద్రయ్య, చింతకుంట గ్రామ పెద్దలు వెట్టి లక్ష్మయ్య, పోడియం సొలొమోన్, మడివి జోగయ్య, విలేకరులు బనాత రాజా, అలవాల వంశీతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



# గ్రామ పరిశుభ్రతే లక్ష్యం

### కెప్టెన్ బంజారా సర్పంచ్ అరేం అచ్చమ్మ

కామేపల్లి,అక్టోబర్ 13 (జనంసాక్షి): గ్రామాన్ని పరిశుభ్రంగా, ప్రజలకు ఆరోగ్యకరంగా ఉంచడమే తమ ప్రధాన ధ్యేయమని కెప్టెన్ బంజారా గ్రామ పంచాయతీ సర్పంచ్ అరేం అచ్చమ్మ స్పష్టం చేశారు. మండల పరిధిలోని కెప్టెన్ బంజారా పంచాయతీ పరిధిలోని మద్రిగూడెం గ్రామం సమీపంలో మంగళవారం ప్రత్యేక పరిశుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రహదారికి ఇరువైపులా, పరిసర ప్రాంతాల్లో విపరీతంగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను పంచాయతీ సిబ్బందితో కలిసి తొలగించారు.ఆ తర్వాత రోడ్డు ఇరువైపులా మళ్లీ గడ్డి పెరగకుండా ఉండేందుకు జాగ్రత్తగా గడ్డి మందును పిచికారీ చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అరేం అచ్చమ్మ మాట్లాడుతూ.. గ్రామంలో వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు,ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు పరిసరాల పరిశుభ్రత అత్యంత కీలకమని పేర్కొన్నారు. గ్రామస్తులందరూ తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విజయ, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తున్న సర్పంచ్, కార్యదర్శి సిబ్బందిని పలువురు గ్రామస్థులు అభినందించారు.

# అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుతో అధిక దిగుబడులు

మధిర, అక్టోబర్ 13 (జనంసాక్షి): రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబిస్తూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడుతుందని మధిర మండల వ్యవసాయాధికారి సాయి దీక్షిత్ సూచించారు.మంగళవారం మాటూరుపేట గ్రామంలో రాశి సీడ్స్ వారి ఆధ్వర్యంలో మధిర మండల పరిసర గ్రామాల రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగం గా రైతు మురళి పొలంలో అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన రాశి సీడ్స్ పత్తి పంటను రైతులకు క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసే రైతులు పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరమైన యాజమాన్య చర్యలను సరైన సమయంలో చేపట్టాలని సూచించారు. పత్తి పంటకు అవసరమైన ఎరువులను పంట దశకు అనుగుణంగా సమతుల్యంగా వినియోగించాలని, నీటి యాజమాన్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.అదేవిధంగా పంటలో కలుపు మొక్కలు పెరగకుండా సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని, పురుగుల ఉనికిని ప్రారంభ దశలోనే గుర్తించి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తున్న రైతులు మొక్కల పెరుగుదల, పూత మరియు కాయల అభివృద్ధిని నిశితంగా గమనిస్తూ తగిన యాజమాన్య పద్ధతులను పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాశి సీడ్స్ కంపెనీ టెరిటరీ మేనేజర్ పవన్ కుమార్, బాలకోటిరెడ్డి, ఏ ఈ ఓ లు సుష్మా జిష్ణు, రైతులతో పాటు కంపెనీ డీలర్లు సిబ్బంది పాల్గొన్నారు.





# వనజీవి రామయ్య సతీ మణికి సత్కారం

ఖమ్మం, అక్టోబర్ 13 (జనంసాక్షి) ప్రతి మొక్కనూ తన కుటుంబ సభ్యుడిగా భావించి, తుదిశ్వాస వరకు పర్యావరణ పరిరక్షణకే అంకితమైన మహోన్నత వ్యక్తి పద్మశ్రీ స్వర్గీయ వనజీవి రామయ్య అని పలువురు నాయకులు కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుపరిపాలనను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఖమ్మం జిల్లా రెడ్డిపల్లి గ్రామంలో బీజేవైఎం ఆధ్వర్యంలో రామయ్య సతీమణి జానమ్మను ఘనంగా సత్కరించారు. రామయ్య ఇంటికి వెళ్లిన నాయకులు, ఆయన ప్రకృతికి చేసిన అపారమైన సేవలను స్మరించుకుంటూ జానమ్మను శాలువాతో సన్మానించి గౌరవించారు.ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ.. వనజీవి రామయ్య ఆశయ సాధన కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆయన స్ఫూర్తితో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా మొక్కలు నాటి, పచ్చదనం పెంపొందించేందుకు విశేష కృషి చేస్తామని జానమ్మకు వివరించి, ఆ మేరకు సంకల్పం తీసుకున్నారు. పచ్చని చెట్లే ప్రగతికి మెట్లని, పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారానే రామయ్యకు మనమిచ్చే నిజమైన నివాళి అని వారు గుర్తుచేశారు.బీజేవైఎం ఖమ్మం జిల్లా అధ్యక్షులు శాసనాల శ్రీరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సత్కార కార్యక్రమంలో.. నకిరికంటి వీరభద్రం, నలమాస శ్రీనివాస్, గుత్తా నాగేంద్రబాబు, ఆకుల నరేష్ గుప్తా, నాయకులు చిర్రా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ వ్యాపారాలపై ఉక్కుపాదం

### లైసెన్సుల్లేకుండా కొనుగోళ్లు చేస్తే జైలు పాలు..!

### జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్



కామేపల్లి,అక్టోబర్ 13 (జనం సాక్షి): నిబంధనలు అతిక్రమించితే లైసెన్సు లు లేకుండా ధనార్జనే ధ్యేయంగా అక్రమ వ్యాపారాలు సాగిస్తే ఊరు కునే ప్రసక్తే లేదు... చట్టం తన పని తాను చేసుకుపోతుంది' అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ అధికారి (డీఎంఓ) ఎం.ఏ. అలీమ్ అక్రమ వ్యాపారులపై నిప్పులు చెరిగారు. నోటిఫైడ్ మార్కెట్ కమిటీల పరిధిలో సరైన అనుమతులు లేకుండా పత్తి, ధాన్యం, మొక్కజొన్న,మిర్చి వంటి రైతుల కష్టార్జితాన్ని కొనుగోలు చేస్తూ మోసాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు పశువుల మార్కెట్ల చట్టం-1966ను ఉల్లంఘించి అక్రమంగా కొనుగోలు కేంద్రాలు నిర్వహించే వారిపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, వ్యాపారాలను వెంటనే సీజ్ చేస్తామని తేల్చి చెప్పారు.చట్టానికి ఎవరూ అతీతులు కారని,ఇప్పటికైనా వ్యాపారులు పద్ధతి మార్చుకుని సంబంధిత మార్కెట్ కమిటీ కార్యదర్శిని సంప్రదించి నూతన లైసెన్సులు పొందాలని డీఎంఓ తుది అల్టిమేటం జారీ చేశారు.

# రంగుండ్లలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

తిరుమలగిరి (సాగర్), అక్టోబర్ 13 (జనంసాక్షి): మండలంలోని రంగుండ్ల గ్రామపంచాయతీ పరిధిలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి ఆంగోత్ గోపాల్ నాయక్ లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జీపీఓ రామస్వామి, గ్రామ కార్యదర్శి మధు, ఉపసర్పంచ్ అంగోతు బంగారు మన్య నాయక్, రేషన్ డీలర్ రవి నాయక్, వార్డు సభ్యులు కమలి, సర్దార్, గ్రామ మహిళలు, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అన్నపూర్ణాదేవిగా అమ్మవారు దివ్యదర్శనం





కనగల్లు, అక్టోబర్ 13 (జనంసాక్షి) శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా మూడోరోజు శ్రీ అన్నపూర్ణాదేవిగా శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారిని భక్తులకు దర్శనం గావించారు. శ్రీ అన్నపూర్ణాదేవి అన్నాన్ని ప్రసాదించే మాతృమూర్తి, అన్నపూర్ణాదేవి సాక్షాత్తు శివ స్వరూపిణి ఈశ్వరుడికి బిక్ష పెట్టిన దేవత అని అమృతా అన్నం తో ఉన్న బంగారు పాత్రను, వజ్రాలు పొదిగిన గరిటను ఆమె ధరించి ఉంటుందని అక్షయ శుభాలను కలిగిస్తుందని అర్చకులు ఆమె దివ్య స్వరూపాన్ని భక్తులకు వివరించారు. అమ్మవారిని ఎరుపు రంగు చీరతో అలంకరించి అన్నపూర్ణాష్టకం స్తోత్రాలు పఠించారు. అమ్మవారికి ఇష్టమైన కట్టె పొంగలి పరమాన్నం నైవేద్యంగా సమర్పించారు.

# అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి

హాలియా జనం సాక్షి అక్టోబర్ 13 శరన్న నవరాత్రుల్లో భాగంగా మూడవ రోజు అమ్మవారు భక్తులకు అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. హాలియా రామాలయంలో అర్చకులు వెంకటాచారులు సాయి మందిరంలో మనోజ్ పాండే సాయి ప్రతాప్ నగరు శ్రీ స్వయంభు వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు రాఘవాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ లు నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# పత్తి రైతులకు శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి శిక్షణ

### చీడపీడల నివారణ, సమగ్ర సస్యరక్షణపై అవగాహన

ఖమ్మం రూరల్,అక్టోబర్ 13 (జనంసాక్షి) పత్తి సాగులో ఆధునిక శాస్త్రీయ పద్ధతులు పాటిస్తూ, చీడపీడలను తొలిదశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా పెట్టుబడి ఖర్చులను నియంత్రించడంతోపాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు.మంగళవారం ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు రెవెన్యూ పరిధిలో ఎంసీపీ?కపాస్ కాంతి పథకంలో భాగంగా వైరా కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించి పత్తి రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పత్తి పంట సాగులో పాటించాల్సిన శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, చీడపీడల ఉధృతిని గుర్తించే విధానాలు, నివారణ చర్యలు, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పంట ఎదుగుదల దశలను బట్టి అవసరమైన యాజమాన్య చర్యలు చేపట్టాలని, పురుగుల నివారణలో శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని తెలిపారు. విచక్షణారహితంగా పురుగుమందులు వినియోగించకుండా, పంట పరిస్థితులను పరిశీలించి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని సూచించారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించుకొని వ్యవసాయంలో శాస్త్రీయ విధానాలను అనుసరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారి జె. ఉమా నాగేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవోలు), స్థానిక పత్తి రైతులు పాల్గొన్నారు.



# పలు అభివృద్ధి అంశాలపై యాదగిరిగుట్ట దేవాలయం బోర్డు దృష్టి



**యాదగిరిగుట్ట ఆలయం అక్టోబర్ 13 (జనంసాక్షి)** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పాలక మండలి మూడవ సమావేశం జరిగింది. ఆలయ పాలక మండలి చైర్మన్ మన్నే సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పాలక మండలి సమావేశంలో కీలక కార్యాచరణకు శ్రీకారం చుట్టుంది. పలు అభివృద్ధి అంశాలపై బోర్డు దృష్టి సారించింది. ముందుగా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న పాలకమండలి సభ్యులు. అనంతరం ప్రెసిడెంట్ సూట్ లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. పాలక మండలి సమావేశం అనంతరం ప్రెస్మీట్ నిర్వహించి మాట్లాడిన చెర్మెన్ మన్నే సత్యనారాయణ రెడ్డి. సమావేశంలో 17 అజెండా అంశాలు, 06 టేబుల్ అజెండా అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించమన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయ అభివృద్ధిని మరింత వేగవంతం, ఆలయ సంప్రదాయాలను పరిరక్షించడమే లక్ష్యం పాలక మండలి పని చేస్తుందని వెల్లడించారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సంస్కృత విద్యాపీఠం హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (ఊంఒ) సంస్థ సీఎస్ఆర్ నిధులతో దేవస్థానం ఆధ్వర్యంలో శాశ్వత భవన నిర్మాణం పనులు చేపట్టేందుకు సంస్థ తో ఎంఓయు కుదుర్చుకునేందుకు ఆమోదం చేశాం అన్నారు. అన్నదాన సత్రం వద్ద భక్తుల సౌకర్యార్థం టెన్సైల్ ఫ్యాబ్రిక్ షెడ్, స్టెయిన్ లెస్ స్టీల్ క్యూలైన్ ఏర్పాటు కు ఆమోదం చేశామన్నారు. కొండపైన భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఆధ్వర్యంలో ఉచితంగా పాదరక్షలు భద్రపరుచుకునేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఆమోదించమని పేర్కొన్నారు. పాతగుట్ట లోని ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణం పనులను దాతల సహకారం తో చేపట్టేందుకు ఆమోదం చేశామన్నారు. రాయిగిరి వద్ద దాతల సహకారం తో నూతన ఆర్చి గేట్ నిర్మాణానికి ఎంఓయు కుదుర్చుకునేందుకు ఆమోదం తో పాటు. కొండపైన నిత్యా కళ్యాణ మండపం నిర్మాణాన్ని దాతల సహకారం తో చేపట్టేందుకు ఎంవోయూ కుదుర్చుకునేందుకు ఆమోదించామని వెల్లడించారు. ఈ నెల 28వ తేదీ నుండి వచ్చే నెల 1వ తేదీ వరకు తెలంగాణ వేద విద్యాన్ మహాసభలు నిర్వహించుటకు అయ్యే వ్యయం 13.66 లక్షలు అనుమతించుటకు. కార్తీక మాసంలో కార్తీక మాసం ఉత్సవాలు నిర్వహించుటకు. దేవస్థానం సిబ్బందికి పెన్షనర్లకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వృద్ధి చేయబడ టీఎ, డీఏ లను అనుమతించనికి ఆమోదం తెలిపాము అన్నారు. అలాగే కొండపైన నిత్యా కల్యాణ మండపం నిర్మాణానికి ఈ నెల 30వ తేదీన భూమి పూజ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. భవిష్యత్ లోను భక్తులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామన్నారు.

## అన్నపూర్ణాదేవి అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



**హుజూర్‌నగర్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** పట్టణంలోని స్వయంభు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దేవీ శరన్న వరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చనలు, అభిషేకాలు, కుంకుమ పూజల అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు నరగిరి రంగభట్టాచార్యులు అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఎడమ చేతిలో రత్నాల గరిట, కుడి చేతిలో బంగారు భిక్షపాత్ర ధరించి సకలకోటికి అన్నాన్ని ప్రసాదించే తల్లిగా అమ్మవారు దర్శనమిచ్చారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం పుణ్యకార్యమని ఈ అలంకరణ తెలియజేస్తుందని అర్చకులు తెలిపారు. ఈరోజు అమ్మవారిని దర్శించుకుంటే ఇంట వంటా సిరిసంపదలు, ఆహార సమృద్ధి కలుగుతుందని చెప్పారు. రాత్రి జరిగిన గుడిసె పల్లకీ సేవలో మల్లెపూల పల్లకీ, బంగారు పల్లకీలో అమ్మవారు ఊరేగారు. "మల్లెపూల పల్లకీ బంగారు పల్లకీ దుర్గమ్మ ఎక్కినాది అందాల పల్లకీ" అంటూ అన్నమయ్య భజన మండలి పాటలు, డప్పు కళాకారుడు ఆకుల రాము, భవాని దీక్షాపరులు, కోలాట కళాకారుల ఆటపాటలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో బాచి కొండయ్య- అనంతలక్ష్మి, మాజీ సర్పంచ్ కోటా సూర్యప్రకాష్-లక్ష్మీపార్వతి, భువనగిరి వెంకటరమణ-రమాదేవి, బోనాల శ్రీనివాస్-రాధిక, దేవరం శ్రీకాంత్ రెడ్డి-సుధా, పచ్చిపాల మల్లికార్జున్-స్రవంతి, కల్లూరి జగదీష్-శివలీల, వెన్న పద్మ, తిరపారెడ్డి, పొనుగుపాటి అశోక్-లక్ష్మి, చప్పిడి బిక్షం, ఆకుల రజిని తదితరులు, కనకదుర్గ సేవా సమాజ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి



**సూర్యాపేట(జనంసాక్షి):** చివ్వెంల మండలంనుకరువు మండలంగా ప్రకటించి, పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి కొనకంచి భద్రయ్య డిమాండ్ చేశారు. మంగళవారం చివ్వెంల మండలంలోని మొగ్గయ్యగూడెం, భీమ్లా తండా, చందుపట్లలో ఎండిపోయిన పంట పొలాలను గ్రామీణ పేదల సంఘం జిల్లా నాయకత్వం, కార్యకర్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట ప్రాంతంలో గత మూడు నెలలుగా ఎల్‌నినో ప్రభావం వల్ల సరైన వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు, బోరుబావులు ఎండిపోయాయని అన్నారు. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో ఈ ప్రాంతంలో తాగునీరు, సాగునీటి కొరత తీవ్రంగా ఏర్పడిందన్నారు. జూలై నెలలో కురిసిన అరకొర వర్షాలను నమ్ముకుని రైతులు పత్తి, పెసర, కంది తదితర పంటలను సాగు చేశారని పేర్కొన్నారు. ఆ తర్వాత వర్షాలు లేకపోవడంతో ఆ పంటలు కూడా పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. ఎండిపోయిన రైతులకు ఎకరానికి 50వేల రూపాయల పంట నష్టం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాషీపంగు సునీల్, అనంతుల ఎల్లయ్య, అంజయ్య, నారాయణరెడ్డి, షేక్ సైదులు, ధరావత్ వీరన్న, కట్టంగూరు వెంకటరావు, పంతం భ్రమణాచారి, భూక్య వెంకన్న, భూక్య చక్రం, భూక్య పెద్దవల్యా, సిగ వెంకన్న, చిన్నవల్యా తదితరులు పాల్గొన్నారు.

## బీబీనగర్ ప్రజలందరికీ ఆ దుర్గమాత ఆశీస్సులు ఉండాలి -గోలి పింగల్ రెడ్డి



**బీబీనగర్ (జనంసాక్షి):** బీబీనగర్ మండల కేంద్రములో శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ దుర్గమాత శరనవరాత్రోత్సవాలలో బాగంగా ,శ్రీ దుర్గామాత ఉత్సవ కమిటి – బీబీనగర్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన అమ్మవారి మంటపంలో మంగళవారం అన్నపూర్ణ దేవి అలంకారంలో మాత కి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి పూజల్లో పాల్గొని మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా భక్తి శ్రద్ధలతో పూజిస్తూ ,అమ్మవారి కృపాకటాక్షాలు బీబీనగర్ ప్రజలపైన ఎల్లపుడు ఉండాలని ఆ అమ్మవారిని కోరుకున్నారు .అనంతరం బీబీనగర్ మండల మాజి ఎంపిపి ౘ జడ్పీటిసీ శ్రీమతి ౘ శ్రీ గోలి ప్రణీత పింగల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంబించారు ,ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసుల ఆంజనేయులు గౌడ్ గారు, బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్, టౌన్ ప్రెసిడెంట్, టంటం రాఘవేందర్, ఉప్ప అధ్యక్షుడు పెరబోయిన బస్వారాజ్, పంజాల వెంకటేష్ గౌడ్, వార్డ్ సభ్యులు, జూజీఇబ డైరెక్టర్ ఉప్పాలంచి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి

### టీపీసీసీ రాష్ట్ర మాజీ జాయింట్ సెక్రెటరీ ఎండి. అజీజ్ పాషా



**హుజూర్‌నగర్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని టీపీసీసీ రాష్ట్ర మాజీ జాయింట్ సెక్రెటరీ ఎండి. అజీజ్ పాషా పిలుపునిచ్చారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 నవంబర్ నాటికి డిగ్రీ, దానికి సమానమైన డిప్లొమా పూర్తి చేసిన వారు ఫారం–18 ద్వారా సెప్టెంబర్ 28 నుంచి ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. చివరి తేదీ నవంబర్ 6 అని, అభ్యర్థి తప్పనిసరిగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పరిధిలోని పౌరుడై ఉండాలని పేర్కొన్నారు. కావలసిన సర్టిఫికెట్లు: ఓటర్ ఐడీ కార్డు, ఆధార్ కార్డు, డిగ్రీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, మొబైల్ నంబర్ ఉండాలన్నారు.

## వార్తలు వస్తున్నా మారిని వైద్య సిబ్బంది తీరు

### పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్న వైద్యాధికారి

- ఇందుగుల పల్లె దవాఖానా తీరుపై ఇటు పత్రికల్లో రాతలు, అటు ప్రజల ఆవేదన
- కథనాలు వస్తున్నా ఏమాత్రం చలించని వైనం.. నిద్రమత్తు వీడని అధికారులు
- సర్పంచ్ లేని అలుసే కదా అని విధులకు ఎసరు పెడుతున్న సిబ్బంది




**మాడుగులపల్లి అక్టోబర్ 13 (జనంసాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై మీడియాలో ఎన్ని కథనాలు వస్తున్నా, అధికారుల తీరులో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదు నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం ఇందుగుల గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖానా) విషయంలో ఇదే జరుగుతోంది దవాఖానా సమయానికి తెరవట్లేదని, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు ప్రముఖ పత్రికల్లో వార్తలు ప్రచూరితమైనా సంబంధిత వైద్య అధికారికి మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం గమనార్హం

**పత్రికలకెక్కినా అంతులేని నిర్లక్ష్యం**

పదే పదే పత్రికల్లో కథనాలు వస్తున్నా, అధికారుల పద్ధతి మారకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మా ఊర్లో సర్పంచ్ లేరు, ఎన్నికలు జరగలేదు.. మమ్మల్ని అడిగే దిక్కెవరు? అనే ధీమాతోనే సిబ్బంది, వైద్య అధికారులు ఇంతటి నిర్లక్ష్యానికి పాల్పడుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఎప్పుడు తెరుస్తారో, ఎప్పుడు మూస్తారో తెలియని ఈ దవాఖానా వల్ల ప్రాణాపాయం వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీస్తున్నారు

**ఇక ఊరుకునే ప్రసక్తే లేదు**

ఇప్పటివరకు వార్తలు రాసినా స్పందించని అధికారుల బరితెగింపుపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు ఇకపై కూడా వైద్య సిబ్బంది వైఖరిలో మార్పు రాకపోతే నేరుగా జిల్లా కలెక్టరేట్ ముందటే ఆందోళన చేపడతామని, డీఎంహెచ్ఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యులైన వారిపై వేటు వేసి ఆసుపత్రి సేవలను గాడిలో పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# గొలుసుకట్టు చెరువులను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

## రైతుల కోరిక మేరకు స్పందించిన మంత్రి వెంకట్ రెడ్డి తక్షణమే అధికారులకుఆదేశాలు

**కనగల్లు, అక్టోబర్ 13 (జనంసాక్షి)**
మండలంలో గొలుసుకట్టు చెరువులు నింపేందుకు నీటిపారుదల శాఖఅధికారులు ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి నీటిని అందించే మార్గాలను క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలన చేశారు. మండలంలోని చిన్న మాదారం, చెట్ల చెన్నారం, బాబాసాహెబ్ గూడెం, ఎస్. లింగోటం గ్రామాల్లో గొలుసుకట్టు చెరువులను నింపి, ఆయా గ్రామాల్లో తాగునీరు, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని రైతులు చేసిన విజ్ఞప్తి మేరకురాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించి గొలుసుకట్టు చెరువులను నింపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో పర్యటించి చెరువుల పరిస్థితి, నీటి లభ్యత, చెరువులను నింపేందుకు అవసరమైన ఏర్పాట్లపై వివరాలు సేకరించారు. చెరువులను నింపేందుకు అవసరమైన అంచనాలు రూపొందించి, ప్రతిపాదనలు సిద్ధం చేసి, నిధుల మంజూరు కై ఉన్నత అధికారులకు నివేదికలు పంపుతామని ప్రజా ప్రతినిధులకు అధికారులు తెలియజేశారు. గొలుసుకట్టు చెరువులు నిండితే ఆయా గ్రామాల్లో తాగునీరు, సాగునీటి సమస్యలు తగ్గడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చెరువుల్లో నీరు నిల్వ ఉండటం గ్రామ ప్రజలకు, రైతులకు ఎంతో అవసరమని పేర్కొన్నారు.రైతుల సమస్యల పరిష్కారంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, మండలంలో రోజురోజుకు నీటి ఎద్దడి పరిస్థితిని గమనిస్తూ చెరువులను నింపేందుకు అవసరమైన ప్రతిపాదనలను త్వరితగతిన సిద్ధం చేసి, పనులకు ఆమోదం, నిధుల మంజూరు లభించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచులు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ సి ఈ శ్రీనివాస్ రెడ్డి, ఈ ఈ జాన్, ఎం ఈ సంపత్, జితేందర్ రెడ్డి ఏఈ గౌతమి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవి రెడ్డి, వెంకట్‌రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ కన్వీనర్ గోలి జగాల్ రెడ్డి, ఆర్టీఏ సభ్యుడు కె రాజిరెడ్డి, గ్రామ సర్పంచులు మలికంటి సుజాత రాజు, నామిరెడ్డి నరేందర్ రెడ్డి, పోచ మల్ల సురేష్, రావుల మల్లేష్, గోగుగోవర్ధన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు నరేందర్ రెడ్డి, కోటయ్య , స్థానిక రైతులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ ఫలాలు అందరికీ అందాలి

## స్మార్ట్ కార్డుల అందజేత:సర్పంచ్ వడ్డే సైదిరెడ్డి

**మాడుగులపల్లి అక్టోబర్ 13 ( జనంసాక్షి):** నల్గొండ జిల్లా మాడుగుల పల్లి మండలం చెరువుపల్లి గ్రామంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి స్థానిక గ్రామ సర్పంచ్ వడ్డే సైదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, గ్రామంలోని లబ్ధిదారులందరికీ స్మార్ట్ కార్డు లను అందజేశారు ఈ సందర్భంగా సర్పంచ్ వడ్డే సైదిరెడ్డి మాట్లా డుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు, సేవలు గ్రామంలోని ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా, వేగవంతంగా అందాలనే ఉద్దేశంతో ఈ స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు గ్రామ ప్రజలందరూ ఈ కార్డులను భద్రపరుచు కుని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్ర మం లో ఉపసర్పంచ్ వినోద్, పంచాయతీ కార్యదర్శి సతీష్ రెడ్డి, గ్రామ పంచాయతీ అధికారి ప్రశాంత్, రెవెన్యూ అధికారి రవితేజ, పలువురు వార్డు సభ్యులు, స్థానిక నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణా అలంకారంలో భక్తులకు అభయం



**మేళ్లచెరువు జనంసాక్షి**
ఆకలి తీర్చే అమ్మ... అన్నం పెట్టే అమ్మ... సాక్షాత్తు అన్నపూర్ణా దేవి రూపంలో మేళ్లచెరువు వనదుర్గా అమ్మవారి దేవస్థానంలో మూడో రోజు దసరా ఉత్సవాలు మహా వైభవంగా సాగాయి.శ్రీ వనదుర్గా అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకారంలో బంగారు వర్ణ శోభతో, చేతిలో అన్నపాత్రతో భక్తులకు దర్శనమిచ్చి కరుణా కటాక్షం చూపించారు. అన్నపూర్ణా దేవిని దర్శించుకుంటే ఇంట్లో ధాన్యానికి లోటు ఉండదని, అన్నపానీయాలకు కొదవ ఉండదని భక్తుల నమ్మకం. అందుకే మూడో రోజు ఆలయం భక్తులతో కిటకిటలాడింది.అమ్మవారి అన్నపూర్ణా అలంకారాన్ని చూసిన భక్తులు తన్మయత్వం చెందారు. చండీ పీఠాధిపతి బ్రహ్మశ్రీ కొంకపాక రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో త్రిశతి పూజ, చండీ మహావిద్య, రాజశ్యామల దశమహావిద్య పారాయణలు మారుమోగగా, ఉదయం చండీ నవావర్ణార్చన, సాయంత్రం శ్రీచక్రార్చనతో ఆలయ ప్రాంగణం శక్తిమయంగా మారింది. అనంతరం మంత్రపుష్పం, నీరాజనం, తీర్థప్రసాద వితరణ జరిగాయి. కార్యక్రమంలో కొంకపాక రాధాకృష్ణమూర్తి, సీతాకుమారి, భానుకిరణ్ శర్మ, వీణ, సాయి శ్రీనివాస వెంకట రామశర్మ తదితరులు పాల్గొన్నారు.

# నడికూడ భద్రతకు నిఘా నేత్రాలు

## సీసీ కెమెరాల ప్రారంభం.. దుర్గామాత మండపం వద్ద ఘనంగా అన్నదానం

**గుర్రంపోడు:అక్టోబర్ 13 (జనంసాక్షి)**
నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం నడికుడ గ్రామంలో మంగళవారం ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుర్రంపోడు ఎస్సై వెంకన్న మరియు వికేఆర్ కన్స్ట్రక్షన్స్ ప్రొప్రైటర్ వెలగపూరి కరుణాకర్ రావు, సీసీ కెమెరాలను ప్రారంభించారు. వెలగపూరి కరుణాకర్ రావు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించిన అనంతరం ఎస్సై వెంకన్న, కరుణాకర్ రావు లు మాట్లాడుతూ.. గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల గ్రామంలో శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని మరియు నేరాల నియంత్రణ జరుగుతుందని తెలియజేశారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వెలగపూరి కరుణాకర్ రావుకు నడికూడ గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. అనంతరం నడికుడ గ్రామంలో దేవి శరన్నవరాత్రుల సందర్భంగా శివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గా మాత పూజలో వెలగపూరి కరుణాకర్ రావు శ్రీలత దంపతులు పాల్గొన్నారు.వెలగపూరి కరుణాకర్ రావు సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని గుర్రంపోడు ఎస్సై వెంకన్నతో కలిసి వెలగపూరి కరుణాకర్ రావు ప్రారంభించారు.అన్నదాన కార్యక్రమానికి గ్రామంలోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.ఈ సందర్భంగా నడి కూడ గ్రామస్తులు మాట్లాడుతూ.. వెలగపూరి కరుణాకర్ రావు శ్రీలత దంపతులపై ఎల్లప్పుడూ శ్రీ దుర్గా మాత కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ప్రసరించి వారు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నడికూడ సర్పంచ్ దాస రి ముత్తమ్మ వెంకటయ్య, ఉప సర్పంచ్ టంగు టూరి సాయికుమార్, బొల్లారం సర్పంచ్ రాం బాబు రావు, నడి కూడ గ్రామ వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ ఐతరాజు జానయ్య, మాజీ ఉపసర్పంచ్ శంకరయ్య, స్థానిక నాయకులు ఖలీల్,యూత్ సభ్యులు ఐత రాజు భరత్,పున్నయ్య, మహేందర్,భవాని స్వాములు, నడికూడ గ్రామ పెద్దలు, మహిళలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.






# 108 ప్రసాదములతో అమ్మవారికి నివేదన

## అన్నపూర్ణ దేవిగా అమ్మవారి దర్శనం



**చిట్యాల అక్టోబర్ 13 ( జనంసాక్షి):**
చిట్యాల పట్టణంలోని శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుచున్నాయి. గులాబి ఎరుపు వస్త్రంలో మంగళవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. 108 రకముల ప్రసాదములతో విశేషంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ ఛైర్ పర్సన్ పందిరి గీత రమేష్ విచ్చేశారు. మహిళ భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరై కుంకుమ పూజలు జరిపారు. ఆలయ అర్చకులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ అర్చకత్వంలో పూజాదికాలు జరిగాయి. దేవస్థానం కమిటీ డైరెక్టర్లు గంజి వెంకటేశం, బుద్ధ విమల కృష్ణమూర్తి, రుద్రారపు లింగస్వామి, జిట్టా సాయిలు, బెలిదె సత్యనారాయణ, ఏళ్ల మాధవి బయ్యన్న, కుమ్మర దేవి రవి, ఆలయ అధికారి ఏనుగు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. 108 చీరలతో అమ్మవారి అలంకరణ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాలుగవ రోజు, బుధవారం అమ్మవారు శ్రీ మహా చండీ దేవిగా దర్శనమిస్తారని ఆలయ కమిటీ ఛైర్మెన్ మారగోని ఆంజనేయులు గౌడ్ తెలిపారు. 108 రకముల చీరలతో అమ్మవారి అలంకరణ జరుగుతుందని అన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం

**వలిగొండ, అక్టోబర్ 13 (జనంసాక్షి)**
దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగం గా మంగళవారం మూడవ రోజు త్రిశక్తి క్షేత్రంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్ల కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా, అమ్మవార్లు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.సాయంత్రం చతుఃషష్టి పూజతో పాటు పల్లకిసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవార్ల ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో భిన్నూరి గోపాలకృష్ణ, కమలాకర్ శర్మ, అనురాధ మనోహరి, శ్రీనివాస్ గుప్త, దత్తాత్రేయ శర్మ, ప్రమోద్ ముక్కుమార్, రాకేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.





# వృద్ధ దంపతులకు న్యాయం చేస్తాం

**పిల్లలు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దు :న్యాయ సేవా సంస్థ చైర్మన్ కె. అనిత**

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 13 (జనంసాక్షి):** తమ ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు పట్టించుకోవడం లేదని పోషణతో పాటు ఆరోగ్య సంరక్షణ కూడా చూడటం లేదని దేవరకొండ పట్టణానికి చెందిన వృద్ధ దంపతులు చిలుకూరి భాగ్యమ్మ, చిలుకూరు అనంత రాములు మండల న్యాయ సేవా సంస్థను ఆశ్రయించారు. ఈ విషయంపై స్పందించిన మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, న్యాయమూర్తి కె. అనిత మాట్లాడుతూ తల్లిదండ్రులను సంరక్షించడం పిల్లల బాధ్యత అని పేర్కొన్నారు. వృద్ధ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే సీనియర్ సిటిజన్స్ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని బాధిత దంపతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దేవరకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో వృద్ధ దంపతులకు తక్షణ సాయంగా బియ్యం బస్తా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకట్ రెడ్డి, సీనియర్ సూపరింటెండెంట్ శ్యామ్, శంకర్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామికి ఘనంగా పూజలు



**హుజూర్ నగర్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** మండలంలోని బూరుగడ్డ గ్రామంలో గల శ్రీ ఆది వరాహ లక్ష్మి నరసింహ వేణుగోపాల స్వామి ఆలయంలో క్షేత్రపాలకుడు శ్రీ ఆంజనేయ స్వామి" వారికి పంచామృత అభిషేకము, 108 తమల పాకులచే ఆకుపూజ, గంధ సింధూరము, పానకం, వడపప్పు, పండ్లు, నారికేళము, పులిహోర, వడమాల, ప్రసాద నివేదనలతో ప్రత్యేక పూలదండ అలంకరణ సహిత పూజా కార్యక్రమం నిర్వహించారు. శాశ్వత ఆకు పూజకు ములుగు లింగం బాబు ధర్మపత్ని సత్యవతి దంపతులు, కర్నాటి శ్రీనివాస్ పద్మావతి దంపతులు సహకరించినారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి నాగేశ్వ శంబీ రెడ్డి, ఆలయ చైర్మన్ యరగాని బిక్షం గౌడ్, ధర్మకర్తలు యరగాని సతీష్ గౌడ్, ప్రార్థన బోయిన గంగయ్య, గూడెపు నాగలింగం, అద్దంకి సంధ్య, పిట్టల గురవయ్య. కస్తల శంకర్. అర్చకులు హరీష్ కుమారా చార్యులు, దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ మంత్రి ప్రగడ హనుమంతరావు మాతృమూర్తి మంత్రి ప్రగడ ప్రమీలమ్మ, మంత్రిప్రగడ శ్రీనివాసరావు. మంత్రి ప్రగడ రమేష్. కార్యనిర్వహణ అధికారులు ఎంపి లక్ష్మణ్ రావు. గుజ్జుల కొండారెడ్డి. కోన్ రెడ్డి కొండారెడ్డి. యరగాని గురువయ్య. గాలి నాగరాజు. లీలావతి. జయశ్రీ. వై సుజాత. వై అనసూర్యమ్మ. నవిత, ఆలయ సిబ్బంది వై కిరణ్ గౌడ్. వై రమేష్. వై ఉపేందర్. తదితరులు పాల్గొన్నారు.



# జాజిరెడ్డిగూడెంలో సంతకాల సేకరణ

**జాజిరెడ్డిగూడెం మండల అక్టోబర్ 13 (జనంసాక్షి):** జాజిరెడ్డిగూడెంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్ బీ ఐ )ని యథావిధి గ్రామంలోనే కొనసాగించాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంక్ భవనం కోసం లీజ్ కై జారీ చేసిన టెండర్ ప్రకటనను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణాదేవిగా దుర్గామాత దర్శనం

**ఆకట్టుకున్న శరన్నవరాత్రి ఉత్సవాలు**



**జాజిరెడ్డిగూడెం మండల అక్టోబర్ 13 ( జనంసాక్షి)** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాభవానీ అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని పలు గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి. ?అమ్మవారి ఉత్సవాల సందర్భంగా మంగళవారం మండలంలోని కొమ్మాల గ్రామంలో భక్తులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే జాజిరెడ్డిగూడెం లోని గౌడ్స్ కాలనీ వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక అర్చనలు, పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# పట్టణంలో సెల్ టవర్ నిర్మాణంపై ఆందోళన

**నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని స్థానికులు డిమాండ్**



**హుజూర్‌నగర్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** పట్టణంలోని లింగగిరి రోడ్డులో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా సెల్ టవర్ నిర్మాణం చేపడుతున్నారంటూ స్థానికులు మంగళవారం ఆందోళనకు దిగారు. నిర్మాణం అక్రమంగా చేపడుతున్నారంటూ అభ్యంతరం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సెల్ టవర్ నిర్మాణానికి సంబంధించిన అనుమతులపై ప్రశ్నలు లేవనెత్తిన ఆందోళనకారులు, నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా, లింగగిరి రోడ్డులో జరుగుతున్న ఈ నిర్మాణంపై అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆందోళనకారులు విజ్ఞప్తి చేశారు.

# క్షయ రహిత సమాజం కోసం ఛాతి పరీక్షలు

**సర్పంచ్ కృష్ణా నాయక్**



**నూతనకల్ అక్టోబర్ 13 ( జనంసాక్షి)** ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య శివిర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతనకల్ పరిధిలోని బక్కహేమ్లు తండా గ్రామపంచాయతీ లో ఛాతి ఎక్సరే శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణా నాయక్, సిహెచ్ఓ చరణ్ మాట్లాడుతూ క్షయవ్యాధిని త్వరగా గుర్తించి చికిత్స ప్రారంభించడం 2030నాటికి దేశం మొత్తాన్ని క్షయవ్యాధి రహితంగా మార్చడం ఆయుష్మాన్ ఆరోగ్య శివిర్ లక్ష్యం అని వారు తెలియజేశారు.రెండు వారాలకు మించి దగ్గు, బరువు కోల్పోవడం, తేమడలో రక్తజీరలు, రాత్రి వేళల్లో జ్వరం ఉన్నట్లయితే టీబీగా అనుమానించి వెంటనే పరీక్ష చేయించుకోవాల్సిందిగా కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా టీబీ పరీక్షలు నిర్వహించి మందులు అందించడం జరుగుతుందని తెలిపారు.ఎక్సరే శిబిరంలో 90 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనీషా సీతారామ్ రెడ్డి టీబీ నోడల్ పర్సన్ టీబీ కోఆర్డినేటర్ ప్రసాద్, మాధవరెడ్డి,టీబీ సూపెర్వైజర్ సత్యవతీ పంచాయతీ కార్యదర్శి శాంత సెకండ్ ఏఎన్ఎం, హెచ్వి ఒ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గజలాపురం పంచాయతీ కార్మికుడిపై వేధింపుల పర్వం గ్రామంలో ఎంపీఓ విచారణ



**మాడ్గులపల్లి, అక్టోబర్ 13 ( జనంసాక్షి):** నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గజలాపురం గ్రామ పంచాయతీలో బహుళార్థ సాధక కార్మికుడిగా పనిచేస్తున్న కుక్కముడి వెంకటయ్యను విధుల్లోకి రాకుండా అడ్డుకుంటూ, తీవ్ర మానసిక వేధింపులకు గురిచేస్తున్నారన్న వ్యవహారంపై మంగళవారం మండల పరిషత్ అధికారి క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు బాధితుడి ఫిర్యాదు మేరకు గ్రామానికి చేరుకున్న అధికారి, ఘటనపై సమగ్ర విచారణ జరిపారు బాధిత కార్మికుడు ఈ సందర్భంగా బాధితుడు వెంకటయ్య విచారణాధికారి ఎదుట తన ఆవేదనను వెళ్లగక్కారు గత 2019 సంవత్సరం నుండి పంచాయతీలో ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్న తనపై కక్షగట్టి విధులకు రాకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు సర్పంచ్ బ్రాహ్మల రోజా, ఉపసర్పంచ్ ఉగ్గిడి సత్యనారాయణ, వార్డు సభ్యుడు సింగం కార్తీక్, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ రెడ్డిలు కుమ్మక్కై తనను అక్రమంగా విధులకు దూరం చేశారని తీవ్రస్థాయిలో ఆరోపించారు తన నియామక పత్రాలు, బ్యాంకు ద్వారా జమ అయిన వేతన వివరాల కాపీలు వేధింపులకు సంబంధించిన ఆధారాలను విచారణాధికారికి లిఖితపూర్వకంగా సమర్పించారు న్యాయం చేయాలని వేడుకోలు తన కుటుంబ పోషణకు ఏకైక ఆధారమైన ఉపాధిని అన్యాయంగా దూరం చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వెంకటయ్య కోరారు తనకు ఎలాంటి ఆటంకం లేకుండా తిరిగి గౌరవప్రదంగా విధులు నిర్వహించుకునేలా స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు ఎంపీఓ బాధితుడు అందించిన ఆధారాలను, గ్రామస్తుల వివరాలను నమోదు చేసుకున్న మండల పరిషత్ అధికారి ఘటనపై పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు విచారణ నివేదిక ఆధారంగా బాధితుడికి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు అని గ్రామస్తులు తెలిపిన సమాచారం.

# గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**లైసెన్సులు, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి**

**సొసైటీలకు రూ.1,000 కోట్ల నిధి కేటాయించాలి**

**మర్రిగూడ, అక్టోబర్ 13 (జనంసాక్షి)** గీత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎరుకల నిరంజన్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన గీత కార్మికులందరికీ లైసెన్సులు, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. గీత కార్మికుల సొసైటీలకు రూ.1,000 కోట్ల నిధి కేటాయించి, వారి ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సంఘం మండల గౌరవ అధ్యక్షుడు కామ్రేడ్ మాధ సత్యం మాట్లాడుతూ గీత కార్మికుల పెన్షన్‌ను నెలకు రూ.5,000కు పెంచాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల ప్రమాద బీమా ప్రీమియాన్ని వెంటనే విడుదల చేయడంతో పాటు, ప్రమాదాల నివారణకు కార్మికులందరికీ సేఫ్టీ కిట్లు అందించాలని కోరారు.సీపీఐ మర్రిగూడ మండల కన్వీనర్ బుర్ర శేఖర్ మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన గీత కార్మికులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని అన్నారు. గీత కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.





## ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలి

### వైద్యాధికారులకు కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశం

**భువనగిరి,అక్టోబర్ 13 (జనం సాక్షి)**
జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై సమీక్షించారు. గర్భిణుల నమోదు, ఏ ఎన్ సి పరీక్షలు, ప్రసవానంతర సేవలు, శిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, హైరిస్క్ గర్భిణులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాల బలోపేతానికి ప్రణాళిక

### జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో కీలక తీర్మానాలు



**భువనగిరి,అక్టోబర్ 13 (జనం సాక్షి)**
యాదాద్రి భువనగిరి జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకులకు మెరుగైన సేవలే లక్ష్యంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. ఆవేస్ ఉర్ రెహమాన్ చిస్తీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 2026?27 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. జిల్లాలోని పద్దెనిమిది పాఠశాలల్లో నూతన గ్రంథాలయాల ఏర్పాటు, వలిగొండ శాఖా గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణం, జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. తుర్కపల్లిలో గ్రంథాలయ భూమికి ఫెన్సింగ్, పోచంపల్లి, రాజపేట, నారాయణపురం, రామన్నపేట, ఆలేరు గ్రంథాలయాల్లో మరుగుదొడ్ల ఏర్పాటు, అవసరమైన గ్రంథాలయాలకు పెయింటింగ్ పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపారు. పాత దినపత్రికలు, వారపత్రికలను నిబంధనల ప్రకారం వేలం వేయాలని తీర్మానించారు. ఈ అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి విద్యార్థులు, పాఠకులు, నిరుద్యోగ యువతకు మెరుగైన సేవలందిస్తామని చైర్మన్ తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్. వంశీకృష్ణతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని సాగరోడ్డులో గల వాసవీమాత ఆలయంలో మంగళవారం పట్టణ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘాల ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నడుస్తున్నాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీమాత మూడోరోజు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణానికి చెందిన వ్యాపారి దొడ్డి కృష్ణయ్య విద్యావతి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

**కొండమల్లేపల్లి, జనంసాక్షి**

# బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక

### మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది



**సూర్యాపేట(జనంసాక్షి):**
బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలలో ఆమె పాల్గొని మాట్లాడారు. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే ఈ పండుగ ప్రతి ఒక్కరిలో ఆనందాన్ని నింపుతుందని తెలిపారు. మహిళలందరూ కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే పండుగలను కాపాడుకుంటూ, మన సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్.హన్మంత రెడ్డి,మహిళా కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు, మెప్మా ఆర్‌పీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు. ఎస్సై శివకృష్ణ

తుర్కపల్లి, అక్టోబర్ 13 (జనం సాక్షి)
మద్యం సేవించి వాహనాలు నడప రాదని ఎస్ఐ శివకృష్ణ అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామంలోని ప్రధాన రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఒకరిపై, హెల్మెట్, సరియైన పత్రాలు లేని ఎనిమిది మంది వాహనదారులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని దీనివల్ల వాహనదారులతో పాటు ఇతర ప్రయాణికుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని అన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని అన్నారు మద్యం సేవించి వాహనం నడిపే వారిపై పోలీస్ శాఖ తరపున కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ కుటుంబాల భద్రతతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు రోడ్డు సమాధాలను నివారించేందుకు పోలీస్ శాఖ నిరంతరం తనిఖీలు నిర్వహిస్తుందని ,నిబంధనలు ఉల్లంఘించే వారిని ఉపేక్షించబోమని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన సంతోషిమాత



**సూర్యాపేట(జనంసాక్షి):**
దేవి శరన్నవరాత్రి ఉత్సవంలో భాగంగా సంతోషిమాత దేవాలయంలో మంగవారం అమ్మ వారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు భట్టారము వంశీకృష్ణ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నపూర్ణ దేవి అలంకరణ చేయించిన భక్తులచే కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో గల శ్రీచక్రానికి ప్రత్యేక పూజలు చేశారు. భవాని దీక్ష మాలధారణ స్వాములకు దుర్గాపూజలు నిర్వహించారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణంతోపాటు చండీహోమం, రుద్రహోమం, బ్రాహ్మణ ముత్తైదువులకు సుహాసిని పూజ నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, ప్రధాన కార్యదర్శి పబ్బ ప్రకాష్ రావు, కోశాధికారి కొత్త మల్లికార్జున్, కన్వీనర్ నరేంద్రుని విద్యాసాగర్, కో కన్వీనర్ బోనగిరి విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు బెలిదే అశోక్, సోమ శ్రీశైలం, తాళ్లపల్లి రామయ్య, సహాయ కార్యదర్శి దేవరశెట్టి సోమయ్య , యామా వెంకటేశ్వర్లు, నూకా రవిశంకర్, ఉత్సవ నిర్వాహక సభ్యులు గోపారపు రాజు, తల్లాడ కృష్ణమూర్తి,అర్చకులు అశోక్ మిశ్రా, రాఘవాచార్యులు,దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు



**హుజూర్ నగర్ అక్టోబర్ 13 (జనంసాక్షి):**
దేవి నవరాత్రుల సందర్భంగా హుజూర్ నగర్ పట్టణంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో హుజూర్ నగర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ పార్టీ రాష్ట్ర ఎన్.ఆర్.ఐ సెల్ కన్వీనర్ శానంపూడి సైదిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### పెన్‌పహాడ్, మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలాలో డి ఆర్ డి ఓ సన్యాసయ్య, ఎంపీడీవో జానయ్య పెన్షన్ల పరిశీలన

**పెన్‌పహాడ్, అక్టోబర్ 13 (జనంసాక్షి) :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన పెన్షన్ల మంజూరు ప్రక్రియలో భాగంగా, క్షేత్రస్థాయిలో అర్హుల గుర్తింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగుతోంది. మంగళవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంతో పాటు,మాచారం, దుపాహాడ్ గ్రామాలలో చేయూత నూతన పెన్షన్ వెరిఫికేషన్ కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించారు. ఈ తనిఖీల్లో జిల్లా స్థాయి మానిటరింగ్ అధికారి, డీఆర్డీఓ సన్యాసయ్య , మండల పరిషత్ అభివృద్ధి అధికారి జానయ్య స్వయంగా పాల్గొని క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను, దరఖాస్తుల అర్హతలను పరిశీలించారు.
ఈ సందర్భంగా డీఆర్డీఓ సన్యాసయ్య మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి ప్రభుత్వ సాయం అందాలనే లక్ష్యంతోనే ఈ పరిశీలనలు జరుపుతున్నట్లు స్పష్టం చేశారు. ఎక్కడా ఎటువంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనల ప్రకారం అర్హులను ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదికలు అందిస్తామని తెలిపారు. అర్హత ఉండి ఏ ఒక్కరూ నష్టపోకూడదన్నదే అధికారుల ధ్యేయమని ఎంపీడీఓ జానయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ బీస్ రాజేశ్వర్, ఏపీఓ రవి, ఏపీఎం అంజయ్య, పంచాయతీ కార్యదర్శులు జి.నాగరాజు, వెంకటలక్ష్మి, స్వప్న తదితర పాల్గొన్నారు...



### ఈ నెల 22 నుంచి నవంబర్ 4 వరకు

# ఇంటింటా వ్యాధి గుర్తింపు కార్యక్రమం




**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 13,(జనంసాక్షి):**
జిల్లాలో కుష్ఠ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ఈ నెల 22 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు ఎల్‌సీడీసీ? 2026 (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుష్ఠ వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించనున్నారు. అని డిఎహెచ్ఓ రాహుల్ తెలిపారు. అనుమానితులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా ఉచితంగా చికిత్స అందించనున్నారు. కుష్ఠ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించడంతో పాటు వైకల్యాలను నివారించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు ఈ కార్యక్రమానికి సహకరించాలని, కుష్ఠ వ్యాధి లక్షణాలు కనిపించినా లేదా అనుమానం ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ), డిప్యూటీ డీఎంహెచ్ఓలు, ప్రోగ్రామ్ అధికారులు,వైద్యాధికారులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్ఓలు),ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు,ఇతర ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని శాఖ సూచించింది.

